# సాయి మాస్టర్

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ



శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్
పవర్ సిటీ, పరవాడ, విశాఖపట్నం - 531 021.

# సాయి మాస్టర్

## పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ



" అనంతార్య తనూజాతం సాయినాధ సమప్రభం
భరద్వాజమహం వందే సర్వశిష్య ఫలప్రదం"

సంకలనము

## "నామ ధారకుడు"

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**
పవర్ సిటీ, పరవాడ, విశాఖపట్నం - 531 021.
Website : www.saisadguruvani.org
E-mail : sadguruvani@gmail.com

త్రయోదశ ముద్రణ :
2021 సెప్టెంబర్ - 10
(వినాయకచవితి, శ్రీపాద శ్రీవల్లభుల జయంతి)

ప్రతులు : 1000

పబ్లిషర్ :
శ్రీమతి వి.యస్. లక్ష్మీపూర్ణచంద్రరావు
శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్,
పవర్ సిటీ, పరవాడ, విశాఖపట్నం - 531 021.

వెల : రూ. 10.00

ప్రతులకు
శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్
C/o. శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు ®
శ్రీ సద్గురు పాదుకా క్షేత్రం
ప్లాట్ నెం. 13, పవర్ సిటీ,
పరవాడ మండలం, విశాఖపట్నము - 531021
ఫోన్ : 9849645224

ముద్రణ :
యునైటెడ్ పవర్ ఎంటర్‌ప్రైజస్
సుధాహోటల్ ఎదురుగా
పాతగాజువాక, విశాఖపట్నము - 26.
ఫోన్ : 9290621324

# మలి పలుకులు

అందరికీ సాయిని అందించాలనే అశయముతో తాను అన్వేషించి, శోధించి, తన తపస్సుతో సాధించిన **"సాయి లీలామృతాన్ని"** అందరికీ పంచడమే కాక ఆచరణ ద్వారా తాను సాయి స్వరూపులై లక్షలాది హృదయాలను సాయి మందిరాలుగా మార్చిన పూజ్యఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉత్తమమైన సాయి మార్గంలో పయనించాలనే వారికి దిక్సూచి కావాలనే ఉద్దేశ్యముతో నూతన శతాబ్ధి (2000 సంవత్సరము)లో జరిగిన ప్రధమ అఖిలాంధ్ర సాయి మాష్టర్ భక్త సమ్మేళనము సందర్భంగా వెలువరించిన "సాయి - మాష్టర్" (శ్రీ భరద్వాజ గారి సంక్షిప్త జీవిత చరిత్ర) అనతి కాలంలోనే ద్వాదశ ముద్రణకు రావటం, పాఠకులపై ఆ పుస్తకప్రభావము తెలియజేస్తున్నది.

**"సాయి-మాష్టర్"** కేవలము మాష్టారిగారి జీవితము తెలుసుకోవాలనే వారికి ఆనందాన్ని అచరించటమే కాక, ఆర్తితో పారాయణ చేసే వారి పాలిట కల్పవృక్షమై విరాజిల్లుతున్నది. **"సాయి-మాష్టర్"** పుస్తకము పారాయణ ద్వారా కోరికలు, కష్టాలు, బాధలు తీరిన వారు ఎందరో, ఎందరెందరో. చివరకు విద్యార్థులు కూడా **"సాయి-మాష్టర్"** పుస్తకము చదివిన తరువాత, మాకు చదువు మీద ఏకాగ్రత కుదిరిందని, పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యామని ఫోన్ ద్వారా, ప్రత్యక్షంగా, ఉత్తరాల ద్వారా తెలియజేస్తున్న వారు ఎంతోమంది కలరు. అంతటి అద్భుత ప్రభావం కలిగినది కనుకనే **"సాయి-మాష్టర్"** చదివిన ప్రతి వారు వేరొకరికి ఆ పుస్తకము పరిచయము చేయకుండ ఉండలేక పోతున్నారు. అందుకనే అనతి కాలంలోనే ముచ్చటగా 12వ ముద్రణకు వచ్చింది **"సాయి-మాష్టర్"**.

ప్రధమముగా అందరికీ **"సాయి-మాస్టర్"** పరిచయము చేయాలనే ఉద్ధేశ్యముతో 15 సంవత్సరాల క్రితం కేవలము నామమాత్ర రుసుము ఐదు రూపాయలకు అందించిన పుస్తకము, తరువాతి కాలములో ముద్రణా వ్యయము పెరిగినా, ఆర్తులు అర్థార్థులకే కాక జిజ్ఞాసువులకు, నిరుపేదలకు కూడా మా వంతు సహాయముగా ఉచితంగా అందించాలనే ఉద్ధేశ్యముతో పుస్తకము వెల యధాతధంగా కొనసాగిస్తూ 2016 ఫిబ్రవరి 7వ తేది అఖిలాంధ్ర సాయి మాస్టర్ భక్త సమ్మేళనం సందర్భముగా ఈ సంచికను 12వ ముద్రణగా ఆవిష్కరిస్తున్నాము.

ముద్రణలో తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ, అందరికీ అందించడానికి కారణమైన యునైటెడ్ పవర్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత కె.వి. శ్రీహరి గారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు అందిస్తూ సాయి మాస్టర్ పారాయణ ద్వారా మరింత ప్రగతి సాధిస్తూ, ప్రతి ఒక్కరూ, ఉత్తమమైన సాయి మార్గములో ముందుకు సాగాలని కోరుతూ చేయూత నిమ్మని **"సాయి-మాస్టర్"**ని ప్రార్థిస్తూ. ........

పబ్లిషర్

**శ్రీమతి వి.యస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

**Website : saisadguruvani.org**

# కృతజ్ఞతలు

అనుక్షణము నీడలా వెంట నుండి కాపాడుతూ సాయిపథంలో నడిపిస్తున్న సాయి మాస్టార్ పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారికి సహస్ర వందనములు.

తమ ప్రచురణల నుండి మాస్టర్ జీవిత విశేషాలను సేకరించడానికి అనుగ్రహపూర్వక అనుమతి అందజేసిన శ్రీ భరద్వాజ గారి సహధర్మచారిణి మాతృశ్రీ అలివేలు మంగతాయారు గారికి పాదాభివందనములు.

'సాయిమాస్టర్'పారాయణ ద్వారా అనుభవాలు, అనుభూతులు పొంది అవి తమ తోటివారితో పంచుకుంటూ వారికి కూడా 'సాయిమాస్టర్'ని పరిచయం చేస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతాభివందనములు. 'దట్ ఈజ్ సాయిమాస్టర్' అన్నట్లుగా పేజి త్రిప్పిన ప్రతిఒక్కరికి అనుభవాలు ప్రసాదిస్తూ నిర్ధుష్టమైన మార్గంలో నడిపిస్తున్న సాయిమాస్టర్ 12వ ముద్రణకు కారణమైన సద్గురువుకు సహస్ర వందనములు.

పుస్తక ముద్రణలో అన్ని విధాల సహకరించిన యునైటెడ్ పవర్ ఎంటర్‌ప్రైజస్ అధినేత కె.వి. శ్రీహరి గారికి, సంకల్పమును కార్యరూపములోనికి రావటానికి అన్ని విధాల సహకరించిన సత్సంగ సభ్యులందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు అందజేసుకుంటూ.


మీ

**వి.వి. పూర్ణచంద్రరావు**

వ్యవస్థాపక ఛైర్మన్

**శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు**

శ్రీ సద్గురు పాదుకా క్షేత్రము



# పుష్పాంజలి

సాయి ఎలా ఉంటారో చూడలేదు మనము. సాయి ఆచరణ ద్వారా, సూక్తుల ద్వారా బోధించిన దానిని ఆచరణ చేయుటము సాధ్యమేనా? అనే దానికి సమాధానము భరద్వాజగారు.

మన మధ్య మనలాగానే జన్మించి, జన్మసార్ధకత కోసం అన్వేషించి ఉత్తమ మైన సద్గురువును ఆశ్రయించి, తాను గృహస్తు జీవితంలోనే ఉంటూ, ఫకీరు అయిన సాయి బోధించిన సూక్తులకు ప్రత్యక్ష నిరూపణ గా మారి, తాను గురువై, సద్గురువై, సాయి స్వరూపులై లక్షలాదిమందికి మార్గదర్శకులైనారు భరద్వాజగారు.

సంసార సాగరములో మునిగి కొట్టు మిట్టాడు తున్న మనకు, సద్గురువు సమాశ్రయము ద్వారా సముద్రపు అలలపై తేలియాడే మహావిష్ణువులా మారవచ్చు అని, తాను ప్రత్యక్ష నిరూపణ చేసి మనలను వెన్ను తట్టి ముందుకు నడిపిస్తున్న పూజ్య ఆచార్య భరద్వాజ గారి పాద పద్మములకు వినమ్రతతో ఈ చిన్న పుష్పాన్ని సమర్పించుకుంటున్నాము.

# ప్రస్తుతి

పూర్వజన్మ సుకృతము వలన మహాత్ముల సాంగత్యము మనకు లభిస్తుంది. ఏనాటి సుకృతము వల్లనో నాకుకూడ పూజ్యశ్రీ ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారితో పరిచయ భాగ్యము కలిగింది. వారితో కలసిమెసిలింది కొంతే అయినా వారు మాత్రము నా జీవితానికి సరిపడా అందించారు.

నేను శ్రీహరికోటలో (1982 నుండి 1990) పనిచేస్తున్నపుడు మొట్టమొదటి సారిగా శ్రీ భాస్కరరెడ్డిగారింట్లో శ్రీ భరద్వాజగారితో పరిచయం జరిగింది. మొదటిసారిగా వారిని కలసినప్పుడే మనస్సు ప్రశాంతత పొంది ఆనందము కలిగింది. బాగా పరిచయము ఉన్న వ్యక్తిని పలకరించినట్లుగా పలకరించారు. ఆ తరువాత కలసిన ప్రతిసారి ఎంతో ఆప్యాయతతో పలకరించేవారు. అవి మాటలలో చెప్పలేని అనుభూతులు.

శ్రీ కె. నారాయణాచార్యులు తన వివాహ సందర్భముగా వచ్చిన మాస్టరుగారికి నన్ను పరిచయం చేయబోతే ''పూర్ణచంద్రరావు నా కెందుకు తెలియదు, ఇంతకు ముందు నుంచే నాకు తెలుసు.'' అన్నారు మాస్టారుగారు. వారు అందించిన స్ఫూర్తితోనే శ్రీహరికోటలో సత్సంగాలు నిర్వహించుకునేవారము.

మాస్టారుగారి చివరి దర్శనము 1989 ఫిబ్రవరి 3వ తేదిన సూళ్ళూరు పేటలో జరిగింది. సహపంక్తి భోజనము, ఆ తర్వాత సన్నిహిత్యము ప్రసాదించారు. శిరిడీలో నేను తీసిన ఫొటోలు అడిగి, అడిగి తీసుకున్నారు. ప్రతి ఒక్కరికీ సాయిని దర్శింపజేయగలిగిన సాయి మాస్టారుకు చిరు కానుక సమర్పించుకునే అవకాశము కలిగింది. అదీ వారు కల్పించినదే. రైలులో ఒంగోలు బయలుదేరుతూ, డోర్ దగ్గర నుంచున్న మాస్టారుగారు ప్లాట్‌ఫారం మీద నుంచున్న మా అందరికి నవ్వుతూ చేతులు ఊపుతూ అలా కనుమరుగయ్యారు. 1989 ఏప్రిల్ 12వ తేదీ బుధవారం విశ్వచైతన్యములో నిలిచారు. రేడియోలో వార్తల ద్వారా ఆవిషయము విని ఒంగోలు చేరడము జరిగింది.

తెలిసి అడిగానో, తెలియక అడిగానో తెలియదుగాని, చైత్రశుద్ధ సప్తమినాడు దేహాన్ని వీడి సాయిస్వరూపులైన మాస్టారిగారి పాదాలు పట్టుకొని ''మాస్టరుగారు మీరు దేని కోసమైతే చివరి శ్వాసవరకు కృషిచేసారో దానిని నిలబెట్టటానికి నా శాయిశక్తులా కృషి చేస్తాను. మీరు సాయితో చెప్పి ఆశక్తిని నాకిప్పించండి'' అని అడిగేను.

ఏప్రిల్ 14న శ్రీరామనవమి ఉత్సవము కొనసాగించాలా, వద్దా అన్న సంశయముతో ఉన్న మేము అక్కడే ఉన్న శ్రీ అయోధ్యగారితో మా సందేహ నివృత్తి చేసుకోవటము జరిగింది. ''మాస్టారుగారి ఆశయాలలో ఒక్కటైన సత్సంగాలు నిర్వహించటము చాల మంచిది. ''మాస్టారు గారు ఇకలేరు అని ఏడుస్తూ కూర్చునేకన్నా మాస్టారుగారు చెప్పిన కార్యక్రమాలను కొనసాగిస్తే వారు బాగా సంతోషిస్తారు. అంతేకాక వారు నిత్య సత్యులు. కనుక మన వెంట వుండి ఇంకా ముందుకు నడిపిస్తారు. కనుక ఇంకా బాగా మీ కార్యక్రమాలు నిర్వహించండి'' అని అయోధ్యగారు చెప్పేరు.

ఇక్కడి నిర్ణయం కోసం ఎదురుచూసే సత్సంగ సభ్యులకు విషయం తెలియజేయడానికి, శ్రీహరికోట బయలు దేరుతూ మరొక్కసారి, నిర్నిద్రులై ఉన్న మాస్టారుగారి పాదాలు స్పృశించి, వారు చూపిన సాయి మార్గములో పయనించే శక్తిని ప్రసాదించమని వేడుకొని, బయలుదేరి వెళ్ళి యధావిధిగా శ్రీహరికోటలో శ్రీరామనవమి కార్యక్రమాలు కొనసాగించడము జరిగినది.

సాయి మాస్టార్ నిర్ణయానుసారముగా శ్రీహరికోట వీడి 1990లో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జాయిన్ అయి మాస్టారుగారి అనుగ్రహ ఆశీస్సులతో ఇంటి వద్దనే సత్సంగాలు ప్రారంభంచేయడము జరిగింది. సాయి గురించి అంతగా తెలియని ఎంతో మంది సత్సంగానికి హాజరవడము, తద్వార సాయితో పరిచయము కలగడము, సాయి లీలామృతము పారాయణద్వారా సాయి కృపను పొందడము జరిగినది.

సత్సంగము జరిగే చోటుకు మహాత్ములు వచ్చి ఆశీర్వదిస్తారని మాస్టారు చెప్పిన మాటను నేను ప్రత్యక్షంగా అనుభవించాను. ఎందరో మహాత్ములు

సత్సంగమందిరానికి వచ్చి, తమ దర్శన ఆశీస్సులు అందించడమే కాకుండా, మాస్టారుగారిని కూడ ఎంతో ఉన్నతంగా కొనియాడారు.

అలా ఎన్నెన్నో మధురానుభూతులను అందించిన మాస్టారుగారి సన్నిహిత్యము (రచనల ద్వారాగాని, ప్రత్యక్షముగా గాని) పొందిన అందరము ఒకచోట చేరి మధురానుభూతులను ఒకరికొకరు పంచుకోవాలనే కోరికతో 2000 ఫిబ్రవరి 1,2,3 తేదీలలో ఉక్కునగరము కేంద్రముగా చేసుకొని, ''అఖిలాంధ్ర సాయిమాస్టార్ భక్త సమ్మేళనము'' నిర్వహించడము జరిగినది. ఆ మూడు రోజుల కార్యక్రమాలు మాస్టారుగారి అనుగ్రహముతో, మాతృశ్రీ అలివేలు మంగతాయారుగారి ఆశీర్వాదములతో, ఎంతో దిగ్విజయముగా నిర్వహించుకున్నాము.

సాయిపేరిట కార్యక్రమాలు చూసేముగాని, ఎవరు ఈ సాయిమాస్టారు? అని చాలమంది ప్రశ్నించడము జరిగినది. అయితే సమ్మేళనములో పాల్గొన్నవారికి సాయి మాస్టారు అంటే ఏమిటో కొంతతెలిసింది. మాస్టారుగారి గురించి తెలుసుకోవాలని కుతూహలము ప్రజలలో పెరిగింది.

అంతేకాక, నిరంతరము నీడలా వెంటఉండి కాపాడుతున్న మాస్టారుగార్ని తలచుకొన్న సమయములో ఎవరండి ఆయన? అంత ఎక్కువగా తలచుకుంటున్నారు అని అడిగినవారికి మాస్టారుగారి గురించి, తెలియజేయాలని అనిపించింది. మాస్టారుగారి రచనలు చదివి అనుభూతులు పొందిన వారు కూడా, మాస్టారుగారిని ఒక రచయితగా మాత్రమే చూస్తుంటే వారికి కూడా మాస్టారుగార్ని గురించి తెలియ చేయాలనిపించింది. అయితే ఎలా? ఏవిధముగా?

తన గురువు అయిన సాయి గురించి మాస్టారుగారు అందించిన మార్గములోనే, మన గురువు అయిన మాస్టారుగారి గురించి అందించడమే సరియైన మార్గమని తోచింది. శిరిడీ సాయిబాబాని పరిచయము చేస్తూ పూజ్యశ్రీ ఆచార్య భరద్వాజగారు ''సాయిబాబా'' అను చిన్న పుస్తకము అందించినారు. అదే విధముగా శ్రీ భరద్వాజగారి గురించి తెలియని వారికి పరిచయము చేయాలని సంకల్పము కలగటము, దానికి మాస్టరుగారు ఆమోదించడము. దానికి శ్రీ

భరద్వాజగారి సహధర్మచారిణి మాతృశ్రీ అలివేలు మంగతాయారుగారు తమ అనుగ్రహ ఆశీస్సులు అందించడమే కాకుండా మాస్టారుగారి గురించి తెలియజేయటానికి, గురు పాదుకా పబ్లికేషన్స్ ప్రచురణల నుండి విషయసేకరణకు సహృదయంతో అనుగ్రహ పూర్వక అనుమతి అందజేసినందులకు మాహృదయ పూర్వక సహస్ర కృతజ్ఞతాభివందనములు.

మారుమూల గ్రామాలకు సైతము అందరికి అందుబాటులో మాస్టారు గారిని పరిచయము చేయుటమే ముఖ్యోద్దేశము. ఒకసారి ఆ అమృతాన్ని ఆస్వాదించారా! ఇక మాస్టారుగారి గురించి ఇంకా తెలుసుకోవటానికి ప్రయత్నించేవారికి, అందుబాటులో **''మహాత్ముల ముద్దు బిడ్డడు'' ''నాకు తెలిసిన మాస్టారు'' ''ఆచార్య అమృత లేఖావళి''** ద్వారా మనలో ''మరో నందదీపం'' వెలిగించటానికి సిద్ధంగా ఉన్నారు.

ఆ మకరందాన్ని గ్రోలుదాము, సాయి మాస్టారు కృపామృతములో ఓలలాడుదాము.

వందనములతో...

మీ

**వి.వి. పూర్ణచంద్రరావు**

ఫౌండర్ కమ్ ఛైర్మన్

**శ్రీ శిరిడీ సాయి సేవాట్రస్టు**

**శ్రీ సద్గురు పాదుకా క్షేత్రము**
**ప్లాట్ నెం. 13, పవర్ సిటీ, పరవాడ మండలం,**
**విశాఖపట్నము - 531 021.**

ఓం శ్రీ సాయినాథాయనమః

## అందరికీ ఇదే మా పిలుపు

ఏనాడో సమాధిచెందిన శ్రీ సాయిని, ఇంటింట ఆరాధనా మూర్తిగా, పిలిస్తే పలికే దైవంగా, ఆపద్బాంధవునిగా, కరుణామూర్తిగా, తన అర్చనలతో, సత్సంగములతో, ప్రవచనములతో అట్టడుగు మానవుడు కూడ సమర్థసద్గురుని అనుగ్రహంపొందేలా, తన పుణ్యఫలాన్ని మానవాళికి, ధారపోసిన ధన్యులు నిత్యసత్యులు, సాయినాథుని వరపుత్రులు శ్రీ భరద్వాజులు.

నిజమైన మానవత్వమే ఆస్తికత అని, అది అలవరచుకున్న తర్వాతనే, ఏసాధనయైనా మనకు పనికి వచ్చేదియని, ఘంటాపథంగా నిర్దేశించి, అందుకు ఆలంబనగా సద్గురు కూటమికే సామ్రాట్ అయిన శ్రీసాయినాథుని ఈ యుగావతారంగా జనావళికి అందుబాటులోకి తెచ్చిన పుణ్యశాలి శ్రీ ఆచార్యులవారు.

ఏపండు తాను మధురంగా వుంటానని చాటుకోదు. రుచి చూసి దాని మాధుర్యానికి విలువ ఇస్తాము. ఆ పండును ప్రసాదించిన వృక్షము ఇంకెంత గొప్పదో గ్రహించగలుగుతాము. అలా సాయి అనే మహావృక్షానికి పండిన మధుర ఫలమే శ్రీ భరద్వాజులు.

ఆనందము, అగాధము అయిన సముద్రాన్ని ఔపాసన పట్టలేము. కాని రుచి మాత్రం చేత (ఉప్పునీరు) సముద్రజలము అని చెప్పగలము. అలాగే విశ్వవ్యాపియైన సాయిని ఏమని చెప్పగలం? కాని ఆచార్యుల వారితో ఒకింత సన్నిహిత్యము సదేహంగాగాని, వారి రచనలు ద్వారాగాని, ప్రవచనముల ద్వారాగాని, కలిగితే సాయి అంటే ఏమిటో? దృశ్యమానంగా మనో:ఫలకముమీద ఆవిష్కరింప చేస్తారు.

## సాయి మాస్టారు

ఒక దివ్యజ్యోతి అనేక చిరుదివ్వెల వెలుగుకు సహకరిస్తుంది. అలా ఆచార్యులవారి సాంప్రదాయ బద్ధమైన సాయి యోగం, అందరికి అందాలని, జగమెరిగిన బ్రాహ్మణులైన శ్రీ ఆచార్యులవారికి, ఒక చిరు జందెపుపోగు అలంకరించి, ఈ చిన్ని పుస్తకములో పరిచయం చేస్తున్నాం. ఈ మా ప్రయత్నాన్ని ఆశీర్వదించి, ప్రోత్సహించి, సాయి మాష్టర్ సాంప్రదాయ రథసారథులుగా, మీరందరూ తరలి రావాలని మా ఆకాంక్ష. పరిపూర్ణం చేయ్యడం మీ వంతు. అనుగ్రహం చూపడం శ్రీ దత్తసాయి మాష్టర్‌వంతు.

## సహజస్థితికి దర్పణం ఈసన్నివేశం

అది 1986 సం॥ గుంటూరు అరండల్‌పేట 4వ లైనులోని శివాలయం. ఆ శివాలయంలో నిర్మించబడ్డ శ్రీ శిరిడి సాయిబాబా మందిర కలశ ప్రతిష్ఠ మహోత్సవం. అటు ఇటు తిరుగుతున్న సాయి భక్తులు. అందరి ముఖాలలో ఆనందం ఉత్సాహం. ఎవరికోసము ఎదురు చూస్తున్న ఎదురు చూపులు. అందరినోట ''మాష్టరుగారు'' వస్తున్నారు, అని. అబ్బో! ఎవరో మాష్టరట. ఆయన ఎంతగొప్పవారో! మంది మార్బలం మేళతాళములతో వస్తారు కాబోలు! అనుకుంటున్న జనసందోహం.

ఇంతలో ఒక ఆటో వచ్చింది. అందులోనుంచి సాదాసీదాగా దిగిన ఒక నిండైన విగ్రహం. ముఖాన చిరునవ్వు, చక్కని తేజస్సు, కోరాపంచె లుంగీగా, గోధుమ వర్ణం లాల్చి, అదే కలరు పైకండువా, ఎంతో సింపుల్‌గా దిగిన ఆమూర్తిని చూస్తూనే ''సాయినాధమహరాజ్‌కి జై'' అని భక్తుల కేకలు. వారే మహాత్ములందరి చేత ''సాయిబాబాకి బేటా'' అని కీర్తించ బడ్డ ధన్యులు, సాయి లీలామృత సృష్టికర్త పూజ్యశ్రీ ఆచార్య భరద్వాజులు.

పరుగు పరుగున భక్తులు వెళ్ళి నమస్కరిస్తుంటే తనచేతిని హృదయానికి ఆనించుకొని, ఆ నమస్కారములను హృదయస్థుడైన ''సాయికి'' నివేదించే ఆ నిరహంకారమూర్తి వినయ శోభచూడ వలసినదే!

అలా మందిర పైభాగానికి ఎక్కి కలశ ప్రతిష్ఠను తన చేతులమీదుగా చేసి క్రిందకు నిచ్చెనమీదగా దిగివచ్చే వారిని చూస్తుంటే, దివికేగిన సాయిని, ఆమెట్లమీదనుంచి భూమిమీదకు తీసుకు వస్తున్న ''భగీరధునిలా'' అనిపించే ఒక మధురానుభూతి.

సరే వారి ప్రవచనం, సరైన ఆసనం వేద్దామన్న ఆలోచన కలగలేదు కార్యకర్తలకు. అదివారి తప్పుకాదు. వారి సన్నిధిలో అన్ని ఆలోచనలకు

''ఫుల్‌స్టాప్'' పడుతుంది. సరే! ఆలయ, మెట్లమీద కూర్చున్నారు. మైక్‌కు స్టాండ్‌లేదు. ఒక భక్తుడు చేతిలో మైక్ పట్టుకొని నిల్చున్నాడు. అంతే ''వాగ్దేవి'' ఆచార్యులవారి నాలుకమీద సాయి తత్వ విన్యాసాన్ని లయబద్ధంగా నర్తించ మొదలు పెట్టింది. ''గంగాఝరిలా'' సాయిలీలామృతం అనర్గళంగా ప్రవహించసాగింది. ఈ దృశ్యాన్ని చూచిన సాయిభక్తులు అరె! వీరేనా సాయి మాష్టరు అంటే అని ఆశ్చర్య పడసాగారు. ఈ ఒక్క సన్నివేశంచాలు. వారు సాయికి ఆత్మసమర్పణ చేసిన ధన్యజీవి అని చెప్పటానికి.

ఆ నిరాడంబరత, ఆ నిరహంకారస్థితి. సామాన్య భక్తునిలా వారి ప్రవర్తన చూస్తే రాజాధి రాజు అయినా ''ఫకీరు''లా నిలచిన సాయి గుర్తుకు వస్తారు. అప్పటికే ఆంధ్రదేశమంతటా సాయి అనుంగు బిడ్డడుగా లబ్ధ ప్రతిష్టులై, సాయి భక్త లోకానికి మార్గదర్శకునిగా, సద్గురువుగా విఖ్యాతి నొందిన పూజ్యశ్రీ భరద్వాజులు అనుసరణలో ఆ సాయికే ప్రతిరూపంగా నిలచిన సన్నివేశం ఇది. ఇలాంటివి కోకొల్లలు వారి జీవితంలో.

వేలాది భక్తుల హృదయాలలో పరబ్రహ్మ శ్రీ సాయిని ప్రతిష్టించిన ఆ దివ్యమూర్తి శ్రీ భరద్వాజులు సాయి నాటిన కల్పవృక్షమే మరి! ఆ యుగపురుషుని గురించి కొంతలో కొంతైన తెలుసుకోవాలనే తహ! తహ కలిగింది కదూ ! శుభం భూయాత్. పేజీలలోకి నెమ్మదిగా పఠనం చేస్తూకదలండి.



## చిదాకాశంలో వెలుగులు విరజిమ్మే ''ధృవతార'' పూజ్యశ్రీ ఆచార్య భరద్వాజ

'' కొవ్వొత్తులు వెలుగుతూ వెలుగును పంచి పెడుతుంటే చూసి ఆనందిస్తాం. కాని, ఆ వత్తులను వెలిగించిన ''అగ్గిపుల్ల'' మన మనసులోకి రాదు. అట్టి వారే నా పితృదేవులు, అనంతాచార్యుల వారు'' అంటారు శ్రీ భరద్వాజ.

శ్రీ గట్టుపల్లి శ్రీనివాసాచార్యుల వారికి ద్వితీయ పుత్రులు శ్రీ అనంతాచార్యులవారు. పినతల్లి రంగమ్మగారికి దత్తత అయినందువల్ల ఎక్కిరాల వారు అయినారు. వేద పండితులు, సిద్ధ ఆయుర్వేద వైద్యులు. వారి శ్రీమతి బుచ్చి వెంకటలక్ష్మిగారు. శ్రీ అనంతాచార్యులవారు ఫిలోసఫీలో M.A. చేసారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఉద్యోగాన్ని కూడ వదులు కున్నారు. వారు కనుగొన్న మందు ''ఓజని'' బహుళ ప్రసిద్ధి కెక్కినది. దాని మీద రాబడితోనే సంసార జీవనం సాగించారు. ఆర్ష విజ్ఞానాన్ని మథించే సమయంలో జన్మించిన పుత్రులకు వేద పురుషుల నామాలే నామకరణం చేసారు. 45వ ఏట శ్రీమతి స్వర్గస్థురాలు కాగ తానే బిడ్డలను పోషిస్తూ పిల్లలకు విద్యాబుద్ధులు ''మెట్రిక్'' వరకు తానే నేర్పించారు. వారణాసిలో ''మెట్రిక్'' పరీక్షలు వ్రాయించిన తరువాత కళాశాలలో చదివించారు. ఈ దశలోనే ద్వితీయ వివాహం శ్రీమతి లక్ష్మిగారిని చేసుకున్నారు.

అది 19వ శతాబ్దము. మన దేశములో బ్రిటీషువారి పాలన భయంకరముగా పరిణమిస్తోంది. బ్రిటీష్ వారు మనదేశాన్ని రాజకీయంగాను, ఆర్థికంగాను ఘోరంగా అణచివేయడమే కాకుండ మనదేశ సంస్కృతిని, ధర్మాన్ని అన్ని కోణాలనుండి కృంగదీసే ప్రయత్నాలు ప్రారంభించారు. దేశమంతా మానవత్వం ఆర్తనాదము చేస్తోంది. అటువంటి సమయములో ఆర్ష సాంప్రదాయమును ఉత్తమమైన రీతిలో అందరికి ఆచరణ యోగ్యముగా అందించటానికి, సృష్టి, స్థితి, లయకారకులైన బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు మనలో జ్ఞానాన్ని ఉద్భవింపజేసి, దాన్ని పెంపొందించి, పోషించి తన స్వరూపముగా మార్చి తనలో లయం చేసుకోవటాన్కి సంపూర్ణమైన షోడష కళలతో, 16సంవత్సరాల బాలునిగా సాయినాథుని రూపంలో శిరిడీ గడ్డపై అవతరించారు. కులమత జాతి అంతరాలు చెరిపివేసి అందరూ కలసి వసుధైక కుటుంబముగా జీవించాలని వాచా కాక, ఆచరణ యోగ్యముగా అందించాలని

సాయినాథుడు పాడుబడ్డ మసీదులో నివసిస్తూ దానికి ద్వారకామాయి అని పేరు పెట్టి, హిందు సాంప్రదాయనుసారముగా పూజలందుకుంటూ, నైష్ఠిక బ్రహ్మచారిగా, అగ్నిహోత్రాన్ని వేల్చి, పార్శి సాంప్రదాయనుసారముగా దీపాలు వెలిగించి, క్రీస్తులా బోధలు చేస్తూ, సర్వమత సమన్వయత్వానికి ప్రతీకగా నిలిచి, శాస్త్రములు ఎన్నటికి అబద్ధాలు కావని చెప్పి, ఉపదేశాలు, ఉపవాసాలు, మడి, ఆచారము, మంత్రాలు, మహిమలపైగల మూఢ భావాలను తొలగించి వాటి నిజతత్వాన్ని తెలియజేసి, ఉత్తమమైన గురు సాంప్రదాయమును ఆచరణద్వారా తెలియజేస్తూ '' సబ్‌కా మాలిక్ ఏక్‌హై'' అని బోధించి, తాను సమాధిగ్రస్తులయ్యేంత వరకు ఫకీరుగానే జీవించారు సద్గురు సామ్రాట్ శ్రీసాయినాథుడు.

అటువంటి ఉత్తమమైన సాయి సాంప్రదాయాన్ని ఆశ్రయించి, సాయి ఆచరణద్వారా బోధించిన వాటిని త్రోసివేసి, సాయి పేరిట ఉపదేశాలు, చిల్లర మహిమలు చేస్తూ, సాయి అంటే **5½** అడుగుల మనిషే అని భావిస్తూ సర్వత్రా వ్యాపించి యున్న అవధూత తత్వాన్ని అర్థము చేసుకోలేని అధ్వాన్న స్థితికి ఎదిగి, కులమత జాతి విచక్షణ మరచి వసుధైక కుటుంబముగా కలసి మెలసి జీవించమని, తన అవతార కార్యక్రమము ద్వార బోధించిన సాయిమాటను పెడచెవిని పెట్టి, సాయిని ఆశ్రయించిన వారిలోనే వర్గాలు, వైషమ్యాలు పెచ్చుమీరిపోతున్న సమయములో తల్లడిల్లిన సాయి హృదయము తిరిగి తన సాంప్రదాయాన్ని భూమిపై నెలకొల్పడానికి తన అంశను, అందరి హృదయాలలో జ్ఞానజ్యోతిని వెలిగించాలనే ఉద్దేశముతో దీపాలు వెలిగించే పవిత్రమైన కార్తీక మాసంలో సప్తర్షి మండలంలోని భరద్వాజ మహర్షిని కార్తీక శుద్ధ సప్తమినాడు, నాలుగవ పురుషార్థమైన ముక్తిని అందించడానికి ప్రతీకగా, పుణ్యదంపతులైన శ్రీ ఎక్కిరాల అనంతాచార్యుల, శ్రీమతి లక్ష్మిగార్లకు 4వ కుమారునిగా 30-10-1938 వ తేది ప్రదోషకాలములో భరద్వాజ పక్షి తన గానంతో ప్రకృతిని పరవశింపచేసే సమయములో పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజగా అవతరింపచేయడము జరిగినది.

శ్రీ భరద్వాజగారిది చక్కని దేహపుష్టి. బొద్దుగా ముద్దుగా ఉండేవారు. చిన్న తనం నుంచే అనుకున్నది ఏదైనా సాధించాలనే పట్టుదల చాల తీవ్రంగా ఉండేది, ఆచార్యుల వారిలో. ధ్యానం వారి సహజస్థితి. మొక్కవోని ధైర్యం ఆచార్యులవారిది.

ఎట్టికష్టమైన ఆనందంతో భరించే మనస్తత్వం ఆచార్యులవారిది. ఎక్కువగా నిద్రపోయేవారు. ఇదేమని అడిగితే ''యోగనిద్ర'' అనేవారు. 12వ ఏటనే మెట్రిక్ పాస్ అయినారు. గుంటూరులో ఇంటర్ చదివేటప్పుడు ఫెయిల్ అయ్యారు. శ్రీభరద్వాజ ఫెయిల్ అయినందుకు ఫ్రెండ్స్‌కు పార్టీ యిచ్చారు. పార్టీ ఎందుకు అని అంటే ఫెయిల్ అనేది జన్మలో ఒకేసారి అందుకని అన్నారట. ఆంగ్లభాషలో పట్టాపొందిన తర్వాత 1959లో శర్మా కాలేజిలో (ఒంగోలు) లెక్చరర్‌గా చేరారు.



# అన్వేషణ

గతజన్మలో యోగం ఆచరిస్తూ దేహత్యాగం చేసినవారు, మరు జన్మలో దానిని ఆచరిస్తూ పరిపూర్ణం చేస్తారు అంటారు శ్రీ గీతాచార్యులు.

మరి జీవిత సహజమైన మరణం, సాటివారికి కలిగినప్పుడు కొంత దుఃఖము కలుగుతుంది. క్రమేణా ''కాలం'' దానిని మరిపిస్తుంది. కారణ జన్మలలో అది వ్యతిరిక్త భావాన్ని ప్రతిబింబిస్తుంది. బుద్ధుడు, శ్రీ వివేకానందులు, శ్రీరమణులు ఇలా! అలానే 1955లో తన ఉపనయన సమయంలో తన అన్నగారి కుమారుడు భాస్కరాచార్యుల మరణం ఒకవైపు నాస్తిక వాదానికి మొగ్గుచూపితే, వివేకం ''అన్వేషణ'' కు పురికొలిపింది. జననం, మరణం, దుఃఖం జీవితమంటే ఇంతేనా? అసలు జీవితమంటే ఏమిటి? మృత్యువును అధిగమించలేమా? ఇలా ప్రశ్నలు. ఒకదానితో ఒకటి లింకుగా కొండవీటి చేంతాడులా, మదిలో అలలు అలలుగా పుట్టుకొస్తుండేవి. ఇదే అంతర్మథనం. భగవాన్ చెప్పిన ''నిన్ను నీవు తెలుసుకో'' దానిని ప్రాక్టికల్‌గా ఆచరించి అనుభవ సిద్ధిపొందిన కావ్యకంఠ గణపతి ముని ప్రత్యక్ష సాక్ష్యం. భగవాన్ ఆదేశానుసారం ''నేను'' మీద మనస్సులయం చేసి కపాలమోక్షం సాధించారు. అలాగే ఈ అంతర్మథనంతో ఊరిబయట నడుస్తుండగా తలలో ''టప్'' మని శబ్దం అయిందని, ఒకరకమైన ప్రశాంతత మనస్సుకు ఆవరించినదని, ఎట్టి ప్రశ్న ఉదయించలేదని ఒక శూన్యము, ప్రశాంతము అయిన ''ప్రజ్ఞ'' తనలో కలిగిందని చెప్పారు ఆచార్యులవారు. ''మృత్యువును'' గురించిన మన ప్రశ్న మనకే అప్రస్తుతము అనిపించిందని చెప్పారు శ్రీ భరద్వాజ.

తర్వాత తన అనుభూతి ఎటువంటిది అనేదానికి, వివిధ మత గ్రంథాలు, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలు ఎన్నో చదివారు. ఆ గ్రంథాలలో చెప్పబడ్డ వివరాలు, అన్ని తన అన్వేషణకు పోలి ఉండడము ఆ అన్వేషణ పరిధి శూన్యస్థితిగా ఉండటం ఎంతో ఆనందం కలిగించింది అంటారు ఆచార్యులవారు.

ఇలా శాంతి, ఆనందముల నిలయమైన శూన్యస్థితి తానుపొందిన తర్వాత అట్టి స్థితి పొందినవాళ్ళు, స్వయంగా అనుభవించిన వాళ్ళు ఎవరైనా ఉన్నారా? ఉంటే వారు ఎలా ఉంటారు? వారి స్థితి ఎట్టిది? ఇలా మరలా అన్వేషణ మొదలైంది.

అదే శ్రీ శిరిడీ సాయి విశ్వ విలాస వర్తనమునకు నాందీవాచక మయింది ఆచార్యులవారి జీవితంలో. 1961లో ఉద్యోగాన్ని వదలి, 1962 లో వివేక వర్ధని కళాశాలలో పనిచేస్తున్నప్పుడు తన అన్నగారితో వచ్చిన పంతం కారణంగా **IAS** పరీక్ష ఫాసై హిమాచల్‌ప్రదేశ్ సివిల్ సర్వీసెస్ ట్రైనింగ్‌కు ఆర్డరు రాగా అత్యున్నతమైన రాజపదవి **IAS** ను తృణప్రాయంగా త్యజించారు. తాను విజ్ఞానాన్ని సంపాదిస్తూ, ఇతరులకు అందించటములోనే ఆనందము ఉందని భావించిన మాస్టరుగారు లెక్చరరుగానే ఉండిపోయారు. రాజాధిరాజైన **SAI** ని ఆశ్రయించి మనస్సులను ఏలేరాజుగా మాస్టారు మారాలని సాయి సంకల్పమైనప్పుడు. ఆయన **IAS** కే ఎలా పరిమితమవుతారు.



## సాయిపిలుపు

ఏది జరిగినా మన స్వయంకృషి వల్లనే జరుగుతుంది అనే విశ్వాసము కలిగిన శ్రీభరద్వాజగారు, సాయి దర్శనం వలన మనకేమి ఒనకూడుతుంది అని ప్రశ్నించినా, అన్నగారి పిలుపు మేరకు తోడుగా 1963వ సంవత్సరము ఫిబ్రవరి 8వ తేదీన మొట్టమొదటి సారిగా శిరిడీ గడ్డపై కాలు మోపేరు. ఆ తరువాత జరిగినది మాస్టారిగారి మాటల్లోనే విందాము. ''**సాయంత్రం 6.30 గం. ఆరతి జరుగుతుండగా సమాధి మందిరంలో ప్రవేశించాను. ఏనాడో పరమపదించిన వ్యక్తిమీద ప్రజలకు అంత భక్తి విశ్వాసాలు ఉండటము ఆశ్చర్యమనిపించింది. అక్కడి అరుగు లోపల 1918లో బాబా శరీరాన్ని సమాధి చేశారు. అని తెలియగానే నాకెంతో వెగటు అనిపించింది. ఆ శరీరము ఎంతగా క్రుళ్ళి ఉంటుందో అని తోచి అది వాసన రాకుండ ఉండటానికి అక్కడ ధూపము, అగరవత్తులు వెలిగిస్తున్నారు. అని త్రోచి కడుపులో త్రిప్పినట్లయి వెంటనే గదికి వెళ్ళి అన్నం తినకుండా నిద్రపోయాను**''.

మర్నాడు ఉదయం (**ఫిబ్రవరి, 9వ తేది**) తీవ్రమైన ఆకలి కాగా టిఫిన్ చేయటానికి మద్రాస్ హోటల్‌కు సమాధి మందిరము మీదుగా వెళ్తున్నారు. హారతి, అభిషేకము అయిపోయినవి కాబోలు సాయి మందిరము ప్రశాంతముగా ఉంది. జీవకళ ఉట్టిపడుతున్న సాయిమూర్తిని చూడాలనిపించి మందిరము లోనికి ప్రవేశించారు శ్రీభరద్వాజ. ఆ తరువాత జరిగినది వారి మాటల్లోనే విందాం. ''**ఒక అనిర్వచనీయమైన అనుభూతి. ఈ సృష్టి అంతా ఆయనే, తాను ఆయనలోని భాగమే, ఆయన తనలోనే ఉన్నారు. ఇది భావనగాకాక అనుభూతిగా హృదయంలో ముద్రించుకు పోయింది. ఒక నిర్వికారామయస్థితి, మనస్సు పొందింది. దైహిక కార్యక్రమాలకు మనస్సును తట్టిలేపినా ఎంతో సహకరిస్తున్నది. పనికాగానే గాఢ నిద్రలో మెలుకువ కలిగి మరలా గాఢ నిద్రలోకి జారినట్లు మనస్సు మరలా అనిరామయ స్థితిని పొందుతున్నది.**''

ఆ స్థితినే సహజ సమాధి అన్నారు శ్రీ భగవాన్ రమణులు. కారణ జన్ములైన భరద్వాజగారిని సాయి తన కార్యక్రమములో భాగస్వామిని చేయటానికి నాందియైనది ఈ సంఘటన.

ఇల్లు చేరి కొన్ని నెలలు గడచినా ఆ స్థితి అలాగే కొనసాగింది. ఆకలి, నిద్ర, నీరసం. తిన్నా తినకపోయినా ఇవేమి దేహాన్ని బాధించడం మానివేశాయి. ఏ సమస్యకు అయినా పరిష్కారం తృటిలో స్ఫురించేది. ఏ సంకల్పం కలిగినా తృటిలో నెరవేరేది. ఇతరులను చూస్తుంటే వారి మనోభావాలు తెలుస్తుండేవి. కాలం గుర్తురాక ఆనందంగా

గడిచిపోయ్యేది. సాయి పటం చూస్తే చాలు. ధ్యానం సహజమై ప్రగాఢమైన శాంతి అనుభవమవుతుండేవి. నా వద్దకు వచ్చినవారు నాసన్నిధిలో ఏదో ప్రశాంతత అనుభవిస్తున్నామని చెప్పేవారు. కొంతమంది తమ కష్టాలు తొలగిపోయాయని చెప్పేవారు. అదేమోగాని అందరి రూపాలలో సాయియే కనిపించేవారు. అనే వారు మాస్టారు గారు. ఈ స్థితిని ఆది శంకరులు ఇలా నిర్వచించారు.

''మనస్సు, బుద్ధి, చిత్తము నశింపబడి మనస్సు నిరామయమై జ్ఞానేంద్రియాల వ్యాపారములు అరికట్టబడి దైహిక క్రియలందు ఆసక్తి లేని చిదానంద రూపుని, శివుడిని భజించుచున్నాను''.

ఆచార్యులవారు సాయిని 5 గంటలపాటు దర్శించినప్పుడు జరిగినది మనోలయంకాదు. మనోనాశనం అందుకనే స్థాణువులా నిలబడ గలిగారు. దీనినే ''చిత్త నాశనం'' అన్నారు శ్రీ రమణులు. మన భాషలో ఇదే ఆత్మ సాక్షాత్కారం, ఆత్మసిద్ధి. దానిని శ్రీసాయి ప్రసాదించారు, అని చెప్పకనే చెప్పారు శ్రీ ఆచార్యులవారు.

రాజాధిరాజ యోగిరాజ సమర్థ సద్గురు శ్రీ సాయినాథుని అనుగ్రహం చవిచూచిన తరువాత రెండవసారి శిరిడీ వెళ్ళినపుడు భరద్వాజగారు సాయి, ''నీ సమాధిదర్శనంతోనే ఇంతటి అద్భుత అనుభవం ప్రసాదించిన మిమ్మల్ని సశరీరముతో దర్శించ కల్గితే ఎంత బావుండేది. అయిన, మీ స్వరూపమైనటువంటి ఏమహాత్ముని దర్శించినా నన్ను దగ్గరకు తీసి, ఆదరించి మీయొక్క అనుగ్రహ ఆశీర్వాదాలు వారు నాకు అందించాలని ప్రార్థించారు. తరువాత ఎందరో మహాత్ముల దర్శన ఆశీస్సులు పొందారు. ఒక మహాత్ముడు చెప్పినట్లు ''శ్రీ భరద్వాజ ఎందరో మహాత్ములను దర్శించి వారి వాత్సల్యానికి పాత్రులై చివరికి తానే ఒక మహాత్ములైనారు.'' అప్పటి నుండి దాదాపు 12 సంవత్సరములపాటు అనేక మార్లు శిరిడీ వెళ్ళి నెలల తరబడి అక్కడ ఉండి అద్భుతమైనటువంటి సాయి జీవితాన్ని గురించి తెలుసుకోవాలని గ్రంథాలు, పావనీర్లు, పత్రికలు క్షుణ్ణంగా చదవటమే కాకుండా సాయిని ప్రత్యక్షంగా సేవించిన ఎందరో భక్తులను కలసి సాయికి సంబంధించిన ప్రతి అంశాన్ని తరచి తరచి అడిగి తెలుసుకొని ఆ విషయాలను ఎప్పటికప్పుడు గ్రంథస్తం చేస్తూ ఉండెడివారు. చివరికి వాటిని ఒక అందమైన పుష్పగుచ్ఛముగా చేసి సాయిపాదాలచెంత ఉంచారు. అది చూసిన సాయి తన కరుణామృతాన్ని ప్రవహింపచేసారు. అదే ''శ్రీసాయి లీలామృతము''.

## నాంది

1969వ సంవత్సరములో, భరద్వాజగారు, నెల్లూరు జిల్లా, విద్యానగర్‌లో *N.B.K.R. Science & Arts Degree College* లో *English Lecturer* గా చేరారు. ఒక క్రిష్టియన్ విద్యార్థి మాస్టారుగారి చేతికి ఉన్న సాయి ఉంగరముచూసి ప్రశ్నించిన మీదట, మొట్టమొదటిసారిగా మాస్టారుగారు సాయి గురించి చెప్పడం ప్రారంభించారు. అదే సత్సంగానికి నాందియై, నిరాటంకంగా 12 సంవత్సరములపాటు కుల మతాలకు అతీతులైన ఒక తపోమూర్తియైన ఆచార్యులవారి ఇంటివద్దనే సత్సంగములు కొనసాగినవి. సాదాసీదాయైన ఒక అధ్యాపకుని ఇల్లే ఆధ్యాత్మిక చక్రవర్తియైన శ్రీ శిరిడి సాయి నిలయమైనది. ఎందరెందరో సాధు సత్పురుషులు, జిజ్ఞాసువులు, ఆర్తులు, అర్థార్థులు, హాయిగా వూరటపొంది మన:శ్శాంతిపొందినది ఈగదిలోనే. పల్లెల్నుండి బండ్లుకట్టుకొని వచ్చి సత్సంగాల్లో పాల్గొనే భక్తజనుల పాలిటి దేవాలయం, మసీదు, చర్చి, ఆసాదాసీదా ఇల్లు. నేడు అది శ్రీ గురుభరద్వాజ తపోవనంగా రూపుదిద్దుకోబోతున్నది.

విద్యానగర్‌లో ఉన్న సమయములోనే సాయి ఆదేశానుసారం శ్రీపాకాలపాటి గురువుగారి సూచనలను ఆమోదించి శ్రీ చీరాలస్వామి నర్మగర్భ ఆదేశాన్ని శిరసావహించి పరమ పావని, పుణ్యమూర్తి, మాతృశ్రీ అలివేలుమంగ తాయారుగారిని 1975 మార్చి 6వ తేదీన సహధర్మచారిణిగా స్వీకరించారు. శ్రీఆచార్యులవారి సంతానము చి॥వేదవతి, చి॥ ద్వారకానాథ్. సాయి సందేశము మీదట సాయి సాంప్రదాయానుసారముగా విద్యానగర్‌లో అందరికి ఆదర్శమైన రీతిన, మాస్టర్‌గారి చేతులుమీదుగా మొట్టమొదటి సాయి మందిరము మార్చి 12, 1981లో ప్రారంభింపబడింది. ఆతరువాత మాస్టారుగారు పూర్తి సమయాన్ని సాయి తత్వప్రచారంలో వినియోగించడానికై తన ఉద్యోగాన్ని శాశ్వతంగా తిలోదకాలిచ్చి 1981లో సాయి తత్వప్రచార రథసారథిగా ఒంగోలు చేరారు.

1981 నుంచి 1989 వరకు ఆంధ్రదేశంలో శ్రీ సాయినాథుని దివ్యత్వాన్ని అమృతంగా ఆస్తిక జన సందోహానికి పంచిపెట్టారు. గ్రంథ రచన, సాయిబాబా పక్షపత్రిక నిర్వహణ, సత్సంగములు, ప్రవచనములు, సద్గోష్టులు, హేతువాదులతో

చర్చలు, విద్యార్థులతో వైజ్ఞానిక పరమైన చర్చలు ఇలా శ్రీసాయినాథుని విశ్వరూపాన్ని కళ్ళకు కట్టినట్లు ఆవిష్కరించారు. సూక్ష్మగ్రాహ్యంకాని వారి అద్భుత శక్తితో, కోర్కెలు తీర్చుకొన్నవారు, కష్టాలు తొలగించుకొన్నవారు, ముముక్షువులు, ఎంతమందో చెప్పలేం. వారి అవతారకార్యం స్థూలంగా ఇలా చెప్పుకోవచ్చు.

(1) యువతను ఆధ్యాత్మికతవైపు మళ్ళించడం

(2) మరచిపోయిన దత్త సాంప్రదాయాన్ని గుర్తుచెయ్యడం

(3) అవధూత సాంప్రదాయాన్ని వెలుగులోనికి తేవటం

(4) సర్వులకు సాయి అనుగ్రహాన్ని పంచి పెట్టడం

(5) వ్యక్తిగత ప్రాధాన్యతలేని వేదఋషుల ఆధ్యాత్మికతను చాటి చెప్పడం.

ఇలా సాయి సాంప్రదాయ ప్రవచనాలలో నిరంతరం వెలిగే ''అఖండజ్యోతిగా'' నిలిచిపోయారు ఆచార్యులవారు.



# సత్సంగము

అందరికి సాయి దొరకాలి. ఇదే నా సాధనా విధానం అన్నారు భరద్వాజగారు. అందరు సాయి దరికి చేరాలి. అందరికి ఆయన అనుగ్రహం లభించాలి. వీటిని సాధించటానికి ఆయన ఎన్నుకున్న విధానం 1) సాయి చరిత్ర, శ్రీ గురుచరిత్ర, పఠనం (శ్రవణం/మననం) సత్సంగము- భజన 2) మహాత్ముల జీవిత చరిత్ర పారాయణ 3) సద్గోష్టి.

వీటి వ్యాప్తికి కేంద్రంగా మారుమూల పల్లెలను ఎన్నుకొని పర్యటించారు. పంచమ వేదము అని ఖ్యాతి పొందిన 'సాయి లీలామృతము' అను నిత్య పారాయణ గ్రంథము రచించినారు. ఆ గ్రంథపారాయణ చేసిన వారు సాయికృపకు పాత్రులవ్వడము జగమెరిగిన సత్యము. సాయిలీలామృతములో ''సత్సంగమహిమ'' అనే అధ్యాయాన్ని కేటాయించారు. సాంగత్యానికి మనపై మనము ఊహించలేనటువంటి ప్రభావముంటుంది. అందుకే మనిషికి సాధనతోపాటు సత్సాంగత్యము కూడ అవసరమే అని భావించిన భరద్వాజగారు తాను స్వయముగా సత్సంగాలు నిర్వహించటమే కాకుండా, ఎన్నోసత్సంగ మందిరాలు రూపు దిద్దుకోవటానికి కారణమైనారు. సత్సంగాలు కాలాంతరములో సాయి మందిరాలుగా మారినవి. మాస్టారుగారు నిర్దేశించిన మార్గంలో సత్సంగాలు నిర్వహించుకొనేచోటుకు మహాత్ములు వారంతట వారేవచ్చి దర్శన, స్పర్శన ఆశీస్సులు అందించుట ఒక అద్భుతమైన విషయం. మాస్టారుగారు నిర్దేశించిన సత్సంగ విధానము ఈవిధంగా ఉంటుంది.

వారానికి ఒక్కసారయినా సత్కథ విని, ప్రసాదం తీసుకుపొమ్మని ఇరుగుపొరుగు వారిని ప్రేమతో ఆహ్వానించాలి. అప్పుడు సాయి పటానికి ధూపదీపాలు అర్పించి భావయుక్తంగా ధ్యానశ్లోకం చదువుకొని, అష్టోత్తర శతనామావళి సహాయంతో ఆ సద్గురుని దివ్యగుణాలను స్మరించాలి. తర్వాత కనీసం 30 లేక 45 ని.ము లైన అందరికి సాయి లీలలు వినిపించాలి. మనం చెప్పేది మనంకూడ వింటూ, మనభావాన్ని కూడ సరిదిద్దుకుంటుండాలి. అట్టిలీలలు చేసిన సాయిని పటంలో చూస్తూ కనీసం 30 ని॥ భజనచేసి, అప్పుడను భవమయ్యే శాంతిని అనుభవిస్తు

మౌనంగా 10ని॥ లైన కూర్చోవాలి. మనస్సు చంచలమైతే ముందు విన్న లీలలను స్మరిస్తూ, వాటిని చేసిన సాయి రూపాన్ని చూస్తూ, ఆయన సన్నిధిని భావించాలి. అప్పుడు నైవేద్యము, ఆరతి ఇచ్చి అందరికి ప్రసాదం పెట్టి పంపాలి. ఎంత పేదవాడైన తమ ఇంట ఇటువంటి సత్సంగం పెట్టుకోవటానికి జంకనవసరం లేనంత నిరాడంబరంగా జరుపుకోవాలి. భజన పాటలు ఎన్నడు అలవాటు లేనివారుగూడ పాడుకోగలిగేవిగా వుండాలి. అందరితోను కలసిపాడాలికాని, ప్రత్యేకంగా పాడకూడదు. పాడితే అందరి ఏకాగ్రతకు భంగం కలిగి పాపమొస్తుంది. ఎవరెక్కువ బాగ పాడుతారన్న పోటీభావం బాబాపై శ్రద్ధాభక్తులను, సత్సంగ సభ్యులమధ్య ఆత్మీయతను పాడుచేయకుండ చూచుకోవాలి. ఎప్పుడూ నిర్ణీతమైన కొన్ని పాటలనే భజనలో పాడుతూవుంటే అందులోని భావంపై మనస్సు నిలుస్తుంది. ఎక్కువ పాటలు పాడితే పాటలోని భావాన్ని భావన చేయడానికి అవకాశముండక మనస్సు ఏకాగ్రమవ్వదు. అంతేకాక నేనూపాడాలి అనే పంతులు, కీచులాటకు కారణమయ్యి, సత్సంగమల్లా పాటకచేరీలాగా మారుతుంది. ఈతగు జాగ్రత్తలు తీసుకుంటే సాయి నిరంతరము మన వెంట నుండి నడిపిస్తారు.

ఈ విధానము ఆచరించుకొని పోతూవుండేచోట ఎన్నో అద్భుతాలు జరిగినవి. సత్సంగములో పాల్గొన్న భక్తులకు దివ్యమైన అనుభవాలు కలగడం అలా సత్సంగాలు జరిగిన ప్రతిచోట సాయి మందిరాలు నిర్మించబడటము, ఎన్నోసాయి సమాజాలు ఆవిర్భవింపబడటము, సాయి భక్తులమధ్య అన్యోన్యత ఏర్పడి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కలసికట్టుగా జరుపుకోవడము, సత్సంగసభ్యులకు మహాత్ముల దర్శన ఆశీస్సులు లభించటము, పైగా ప్రతి భక్తుడు నిరాశాజనకమైన జీవితాన్ని కాక ''బాబావున్నారు భయంలేదు'' అనే ఆశాజనకమైన జీవితాన్ని గడపడము ఎందరో యువకులు సన్మార్గములోనికి లాగబడి అనేక రకములైన వృత్తులు ఆచరించుకుంటూ అభివృద్ధిలోకి రావటం. అందరూ ఎరిగిన, కళ్ళతో చూస్తున్న ప్రత్యక్షసత్యం.

సాయి జీవిత చర్యలను ప్రస్తుత సమాజానికి అనువైన, ఆచరణయోగ్యమైన రీతిలో మలచి తెలియచెప్పటం భరద్వాజ నిర్వహించే సద్గోష్టులలోని ప్రత్యేకత. అంతేకాక అందరి సమస్యలకు, ప్రశ్నలకు ఒక సమాధానముతో వివరణ ఇవ్వటం అద్భుతమైన విషయం. ఇది ''ఋతుంబర ప్రజ్ఞ'' అని యోగశాస్త్రము చెబుతుంది.

ఒక భక్తుడు భరద్వాజగారితో ''సార్! మీకు అందరి అభిప్రాయాలు ఎలా తెలుస్తాయి'' అని అడిగితే అందుకు మాస్టారుగారు ''నాలో ఏభావాలు ఉండవు కనుక'' అని సమాధానమిచ్చారు.

ఏభావము లేనివారు చిదానందరూపులు మరి ''ఆచార్యపురుషోవేదః'' అని వేదం చెబుతుంది. దానిననుసరించి మాస్టారుగారు వేదపురుషులే – సాయినాటిన కల్పవృక్షమే మరి!

శ్రీభరద్వాజగారు ప్రతి విషయము తాను అనుసరించి ఇతరులకు చెప్పటమే కాకుండా వారి ఆచరణలోగాని, అవగాహనలోగాని లోపముంటే సరిదిద్ది ముందుకు నడిపించేవారు. అందుకే అందరూ వారిని ప్రేమతో పూజ్య శ్రీ ఆచార్యులవారు అని సంబోధించేవారు.



## తరగని పెన్నిధి - ఆచార్య సన్నిధి

ఆచార్య భరద్వాజగారి సన్నిధి అనుభవించిన వారికే తెలుస్తుంది. అది తరగని పెన్నిధి అని. ఎన్నో సమస్యలతోటి, సందేహాలతోటి, చికాకుల తోటి, భరద్వాజగారి సన్నిధికి రాగానే ప్రశాంత మనస్కులై కూర్చుండిపోతారు. నిరంతరము ఆయన సన్నిధిలో జరిగే సత్సంగము వింటూ మంత్రముగ్ధుల్లా ఉండిపోతారు. ఆ సన్నిధి వీడి బయటకు వెళ్ళిన తరువాత, ఆలోచించుకుంటే, అది ఎంత అద్భుతమో అనిపించడమే కాక, మా సమస్యలకు, సందేహాలకు, పరిష్కారము లభించిందని ఆనంద పడిపోతారు. ఆ ఆనందానికి కారణము, తనలో ఏభావాలు లేని భరద్వాజ, మనలోని భావాలను కనిపెట్టి ఎలా ప్రతిస్పందిస్తారో గమనించ కల్గటమే.

ఒకసారి, షేక్‌వలీ అను టైలరు మాస్టారుగార్ని దర్శించారు. ఆ సమయములో భరద్వాజగారు, సిగరెట్ మీద సిగరెట్ లు కాలుస్తున్నారు. అదిచూసిన షేక్‌వలీ ఈయనను అందరు గురువని పూజిస్తారు కదా! మరి ఈయన ఏమిటి తెగ సిగరెట్‌లు త్రాగుతున్నారని మనస్సులో అనుకున్నారు. వెంటనే మాస్టారుగారు సిగరెట్ ఆర్పివేసి, అతనితో చాలాసేపు మాట్లాడి, అతను బయలుదేరు సమయములో, ''చూసావా, నీవు ఉన్నంత సేపు నీకు ఇష్టములేని పని. (సిగరెట్లు కాల్చడము) చేయలేదు'', అని నవ్వేరు. తన మనస్సులో భావాన్ని గమనించిన మాస్టార్ని చూసి షేక్‌వలీ ఆశ్చర్యపోయారు.

ఒకసారి మేడా జయరాంగారు కుటుంబపరమైన సమస్యలను గూర్చి మాస్టారుగార్ని అడగాలని వారి సన్నిధికి వచ్చారు. అదే సమయములో భరద్వాజగారు, నేరెళ్ళ శ్రీరామమూర్తిగార్కి కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్తున్నారు. అవి కరెక్టుగా జయరాంగారి సమస్యలకు సమాధానాలు. అది విన్న జయరాంగారు ఆశ్చర్యపోయారు.

వి.సి. వెంకటేశ్వర్లగారితో మాస్టారుగారు ఒకసారిలా అన్నారు. I am one of the five angles. అన్నారు. వివరం చెప్పమంటే ''చివటం అమ్మని అడుగు'' అన్నారు.

కుమారి, అనే ఒక భక్తురాలు, తన ఒక్కగానొక్క కుమారున్ని కోల్పోయి,

చాలాతీవ్రంగా బాధపడ్తుండేది. మూడు సంవత్సరముల తరువాత మాస్టారుగార్ని దర్శించింది. ఆమెను చూస్తూ ''ఇంకా ఆబాధను మర్చిపోలేదా'' అన్నారు మాస్టారు గారు. అంతే ఆ క్షణంనుండి ఆమె ఆ బాధను మర్చిపోయింది.

శ్రీ కె.వి. రంగారావు, అను భక్తుడు మాస్టారుగారితో మాట్లాడుతూ రాత్రి 12గం॥ వరకు కూర్చుండిపోయినారు. ఆసమయంలో తీవ్రంగా సిగరెట్ త్రాగాలని అనిపించింది. అది గమనించిన మాస్టారుగారు నీకు సాదా గోల్డ్ సిగరెట్ ఎందుకులే, కొద్దిసేపాగు. నీ బ్రాండ్ సిగరెట్లు వస్తాయి'' అన్నారు. ఇంతలో ఒక వ్యక్తి వచ్చి చార్మినార్ సిగరెట్లు అక్కడ పెట్టి వెళ్ళిపోయారు. వారి సంకల్ప సిద్ధికి ఆశ్చర్యపోవడము శ్రీ రంగారావు వంతు అయ్యింది.

మాస్టారుగారు సత్సంగము చేస్తునపుడు ఒక కుక్క వచ్చి చెవులు నిక్క పొడుచుకొని కూర్చుని ఉంది. మిగతా సభ్యులు లోకాభిరామాయణము మాట్లాడుకొనుచున్నారు. ఇంతలో ద్వారకా, అనే అమ్మాయి ''ఆకుక్క చూడు ఎంత శ్రద్ధగా వింటుందో'' అని అన్నది. అది విని మాస్టారుగారు, ''భడవా, భలే చక్కగా గమనించావే'' అని నవ్వేరు.

ఒకసారి ద్వారకామాయిలో సత్సంగము అయిన తరువాత, మాస్టారుగారు కాఫీ త్రాగుతున్నారు. రంగారావు అను భక్తుడు నాకు కూడ కొంచెం కాఫీ ఇస్తే బాగుణ్ణు అని మనసులో అనుకున్నారు. వెంటనే మాస్టారుగారు, అరే ఎంగిలి కాఫీ త్రాగుతావా, సరే తీసుకో అని ఇచ్చేసారు.

కొత్తపట్నం నుంచి ఒకరైతు భరద్వాజగారి దగ్గరకు వచ్చి, ''స్వామి వర్షాలులేక పంటలు ఎండిపోతున్నాయి. మీరు బాబాతో చెప్తే వర్షాలు కురుస్తాయి కనుక బాబాతో చెప్పండి.'' అని వేడుకున్నారు. ''అలాగే చెప్తాను'' అని అన్నారు మాస్టారుగారు. ఆ మర్నాడు బాగా వర్షము కురిసింది. మరలా రైతు వచ్చి ''పంటలు కూడా బాగా పండేటట్లు బాబాతో చెప్పండి '' అని అడిగారు. దానికి మాస్టారుగారు ''నో చాన్స్ ఒక్కసారే అలా చెప్పే వీలుంటుంది. పంట సమృద్ధిగా పండటం పండకపోవడం ఇక నీ పూర్వపుణ్యముపై ఆధారపడియున్నది అని అన్నారు.

ఒకసారి, మాస్టారుగారి పుట్టినరోజునాడు వారికి స్నానము చేయిస్తున్నారు భక్తులు. ఆ సమయములో మాస్టారుగారు అంగవస్త్రము కట్టుకొని యున్నారు. ఒక భక్తుడు, వారు జ్ఞాని కదా! వస్త్రము ధరించారేమిటి? అని అనుకున్నారు. వెంటనే, అంగవస్త్రము తీసివేసి ఒకచిరునవ్వు నవ్వేరు మాస్టారు గారు.

భరద్వాజగారు, మేము నెల్లూరు సత్సంగము కని కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాము. ట్రైన్ చాల రద్దీగా ఉంది. అందరూ నిల్చున్నారు. ఇంతలో ఒక ముస్లిమ్ తాను కూర్చున్న సీటులోనించి లేచి భరద్వాజగార్ని కూర్చొమని చెప్పి ''అల్లా అచ్ఛా కరేగా'' అని సింగరాయికొండలో దిగి వెళ్ళిపోయారు. ''ఆయన ఎవరో గమనించారా'' అని అడిగారు మాస్టారుగారు. గమనించలేదని మేము సమాధానము చెప్పాము. 'అల్లా అచ్ఛాకరేగా' అని అనేది ఎవరు అని తిరిగి ప్రశ్నించారు మాస్టారు. ''సాయి'' అని మేము సమాధానమిచ్చి ఆశ్చర్యపోయాము.

జయచంద్రా రెడ్డిగారు, శిరిడీ టూరు బయలుదేరుతూ, ఆ బస్సులో ఆచార్యులవారిని కూడ తీసుకొని వెళ్ళారు. పాదలి అని ఊరు వద్ద ఆ బస్సు చెడిపోయింది. బస్సు రిపేరు పూర్తిచేసే టప్పటికి తెల్లవారింది. అయ్యో! మాస్టారుగారు మహాత్ములంటారు కదా! ఆయన ఉండగానే ఇలా అయ్యిందేమిటని అనుకున్నారు. ఆ తరువాత తెలిసింది. ఆ రూటులో రాత్రి వెళ్ళిన నాలుగు బస్సులను దొంగలు దోచుకొన్నారని.

ఒక భక్తుడు మాస్టారుగార్ని ''సార్ మీరు సత్సంగము చేస్తుంటే కుక్కలుకూడ వచ్చి కూర్చుని శ్రద్ధగా వింటాయి. బయటకు వెళ్తే మరలా అరుచుకుంటాయి ఎందుకు? అని అడిగారు. ''అవి నా సన్నిధి గమనించాయేమో'' అని అన్నారు.

ఒక భక్తుడు, '' ...బాబా కళ్ళు చీకటిలో కూడ మెరిసేవి అని వ్రాసారు కదా! మీ కళ్ళుకూడ అలా మెరుస్తాయి కదా! మీరు బాబా ఒక్కటేనా? '' అని అడిగేరు అందుకు మాస్టారుగారు, ''అది ఏమి లేదు అని మాట తప్పించేసారు''.

ఒకసారి, ఒక భక్తుడు భరద్వాజగారితో మీరు శ్రీ వైష్ణవులు కదా! తిరు నామములు ధరించరేమి'' అని అడిగారు అందుకు మాస్టరుగారు, ''అవి ఎప్పుడో నేను ధరించాను'' అవి సిస్టమ్, సర్వీస్, డివోషన్ అన్నారు. మర్నాడు

ద్వారకామాయిలో సత్సంగము చెప్పేటప్పుడు ఆ భక్తునికి ఆచార్యులువారు తిరునామాలతో కనిపించారు. ''భావములోన బాహ్యమునందున గోవింద, గోవింద అని అనవేమనసా''. అన్న అన్నమయ్య చరణం ఇదే నేమొ.

ఒకసారి రంగారావు అనే భక్తునికి ''హి ఈజ్ వెల్ వర్సడ్ విత్ ధర్మశాస్త్ర'' అని సర్టిఫికేట్ ఇచ్చారు. అదేంటి సార్, ''ధర్మశాస్త్రములు'' ఎన్ని ఉన్నాయో నాకు అసలు తెలియదు. అని అంటే ''ఓహో ప్రవచనములు నీవు చెబుతున్నావని అనుకుంటున్నావా, నేను చెప్పిస్తున్నాను అది గుర్తించుకో'' అన్నారు మాస్టరుగారు.

ఆచార్యులవారు ఉత్తమ సాధకులను కూడ హెచ్చరించేవారు. ఎమ్.కె. ఆనంద వెంకటేశ్వర్లు అనే భక్తునికి ఒక ఉత్తరం వ్రాసి యిచ్చి '' మంగమ్మవ్వకు '' ఇవ్వమన్నారు. ఇతను ఆ ఉత్తరం తీసుకొని ఆమె వద్దకు వెళ్ళగానే ఆమె ''ఇది నీ గురువు వ్రాసిన ఉత్తరం. అది నా సాధన గురించి, ఆయనకు ఎందుకు? ఆయన మాట నేనెందుకు వినాలి'' అన్నారు. కాలగతిలో ఆమె తన సాధనను కోల్పోయారు.

ఒకభక్తుడు సార్ మీరు కూడ సిద్ధులు ప్రదర్శిస్తే బాగుండు అన్నారు ''అదే బాబా వద్దంది''. అని అన్నారు మాస్టరుగారు.

శ్రీ ఎమ్. కె. ఆనంద వెంకటేశ్వర్లు, ''మాస్టారుగారి లోపల జరిగే సాయినామ స్మరణ చాలసార్లు స్పష్టంగా విన్నాను'' అని అన్నారు.

**దట్ ఈజ్ మాస్టర్ :** చైనబోయిన వెంకటేశ్వర్లుగారు ఇలా చెప్పారు. ''అవి మాస్టారుగారు ఒంగోలు కు కొత్తగా వచ్చిన రోజులు. నాకు నాటకాలు వేసే అలవాటుంది. దాదాపు 40 నాటకాలు వేసాను. కొంచెం నాస్తిక భావాలు కలవాడిని. అసలు ఈ 'బాబా' లను వదులు కుంటేకాని దేశం బాగుపడదు అనే భావాలు కలవాడ్ని. ఒకసారి కాళిదాసు కోటేశ్వరరావుగారితో కలసి ఆచార్యుల వారిని దర్శించాను. వారు ఆధ్యాత్మికతను గురించి, చెప్పేతీరు నన్ను ఆకట్టుకుంది. ఒకసారి వారితో ''బాబా''లు ఇది అంతా వట్టి హంబక్.'' అని మొండిగా వాదించాను. ఆ మాటకు మాస్టారుగారు కోపించక, ''చూడుబాబు, మొదట్లో నాకు కూడ నీకున్నటువంటి భావాలే ఉన్నవి. సాయిని దర్శించిన తరువాత అవన్నీ పటాపంచలు అయిపోయాయి. ఇదిగో నేను వ్రాసిన, సాయి లీలామృతము అను గ్రంథము నీకు ఇస్తున్నాను. దీనిని

నీవు పూర్తిగా చదివేలోపల, ''బాబా'' నీకు దర్శనమిస్తారు. అలా కాని పక్షంలో ఈ గ్రంథాన్ని ధునిలో వేసి, మర్నాటినుంచి సాయి గురించి ఎవ్వరికి చెప్పను''. అని ఆ గ్రంథాన్ని నాకు ఇచ్చారు. వెంటనే మర్నాటినుండి సాయి లీలామృతము పారాయణ చేయడము మొదలుపెట్టాను. మూడవ రోజు స్వప్నంలో సాయి దర్శనమిచ్చారు. ఆయన రూపం క్రొత్త వెలుగులలో మెరిసిపోతున్నది. నావైపు నడచి వస్తు ''ఆవో బేటా'' అని అంటున్నారు. వస్తున్నాను బాబా, వస్తున్నాను బాబా అని ఆయన వైపు పరిగెట్టాను. ఆరోజునుండి నాలో ఏదో మార్పు కలిగింది. అంతకు ముందు బాబాలను షూట్ చేయాలనుకునే నన్ను సాయి, మాస్టారుగారి సాయిలీలామృతమను బుల్లెట్ తో షూట్ చేసారు. ఈ విషయము తరువాత మాస్టారు గారితో చెప్తే, ''బాబా అంటే అదే మరి'' అని నవ్వారు.

ఎంత చెప్పినా, ఎంత వ్రాసినా, తరగని పెన్నిధి వారి సన్నిధి. అది అనుభవైక వేద్యము. విశ్వచైతన్యంలో నిలచి అందరి వద్ద వున్న ఆయన సన్నిధి నిత్యసత్యము.



## మకరంద ఆస్వాదనము

పరిపూర్ణులైన సద్గురువు మనకు లభించారు. ఆయనను సేవిద్దాము. ఆయన కృపకు పాత్రులవుదాము. ఆయన బోధనలు ఆచరిద్దాము. అంతకుమించి ఋణానుబంధము వలన, ప్రారబ్ధ కర్మవలన, జరగవలసిన క్రియలను, ఆయన జరిపిస్తారు అనే భావనతో మసలు కుందాము'' అని అంటారు మాస్టారుగారు.

సద్గురువు ఎలా ఉంటారు? వారి నిజస్థితి ఏమిటి? వారి స్వరూపము ఎలా ఉంటుంది. వారిని గుర్తించి సేవించటము ఎలా? వీటన్నిటికి సమాధానముగా 'గురుచరిత్ర' అందించారు మాస్టారు గారు.

తద్వారా ఉత్తమమైన గురువును ఆశ్రయించడమే కాక, ఆయనను సేవించి, వారి కృపను పొందే మార్గాన్ని అందించారు మాస్టారుగారు.

కమలము నీటిలోనే ఉంటుంది. దాని క్రింది కప్పకూడ ఉంటుంది. కాని, అది కమలము చుట్టు ఉన్న పురుగులను ఆశించి ఉంటుంది. కాని, ఎక్కడ నుండో వచ్చిన తుమ్మెద పూవులోని మకరంధ్రాన్ని గ్రోలి వెళ్ళిపోతుంది. దగ్గరగా ఉన్న కప్పకు ఏమి లభించింది, పురుగలేరుకోవడము తప్ప? సద్గురువు సేవ మనకు లభించినా, అది ఉపయోగించుకొని, ఆయన కృపకు అర్హులవడము ఎంతమందికి తెలుసు?

సాయి స్వరూపాలైన, ఎక్కడెక్కడో ఉన్న ఎందరో మహాత్ములను దర్శించి, వారి స్వరూపముగా మారిన మాస్టారుగారు, తాను పొందిన మకరందాన్ని మన అందరికి అందించారు. మాస్టారు గారు దర్శించిన మహాత్ములు శ్రీ జిల్లెళ్ళమూడి అమ్మ, శ్రీ పాకలపాటి గురువుగారు, శ్రీ చీరాల స్వామి, శ్రీ ఆనందమాయి అమ్మ, శ్రీ అఖండానంద సరస్వతి, శ్రీ గులవణి మహారాజు, శ్రీ రంగన్న బాబు, శ్రీ రాఖాడీబాబా, శ్రీ పూండి స్వామి, శ్రీ చివటం అమ్మ, శ్రీ వెంకయ్య స్వామి, శ్రీఅనసూయమాత, సంత్ గులాబ్ బాబా, శ్రీ నారాయణ మహారాజ్, శ్రీమతి రెడ్డమ్మ, శ్రీ మాయిఅమ్మ, శ్రీ కడప అవధూతేంద్రులు, శ్రీ ఖాన్‌సాహెబ్,

శ్రీ రామిరెడ్డి తాత, శ్రీ గోపాల్ స్వామి, శ్రీ నాగమునీంద్రస్వామి, శ్రీ నాంపల్లి బాబా, శ్రీ పూర్ణానందస్వామి గారు, శ్రీ రాఘవ నారాయణమూర్తి, శ్రీ శివనేశన్ స్వామి, శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి, శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి, శ్రీ జిడ్డు కృష్ణమూర్తి ఇలా ఎందరెందరో మహాత్ములను దర్శించారు. వారందరు శ్రీ భరద్వాజని తమంతటి వారని కీర్తించారు. మహాత్ములెలా ఉంటారు అనే దానికి వివరణే వారి యొక్క దర్శన సందర్శనలోని రహస్యము. కనుక అనాదిగా వస్తున్న సాంప్రదాయ బద్ధమైన వేద విధానాన్ని భరద్వాజగారు మనందరికి అందించారు. అదే సద్గురుసమాశ్రయము. దైవశక్తి తో పాటు ధీటుగా, కలి ప్రభావము ప్రవర్తిల్లే ఈ కాలములో ఆసైతాను (కలి) పాలు కాకుండ సద్గురువు దరిచేర్చే, అంశాలు ఏర్చికూర్చి తాను ఆచరించి, అందరికి అందించిన పూజ్య శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారు సమర్థ సద్గురువులే మనకు.



## రాచబాట - మాస్టర్ మాట

కారణ జన్ములైన మాస్టారుగారి అవతార లక్ష్యాలలో ఒకటి నిర్దుష్టమైన సాయి సాంప్రదాయాన్ని అతి సామాన్యునికి కూడ అందుబాటులోకి తేవడం. తద్వార అతను సాయి మార్గములో నడవ గలగాలి. తాను పొందిన ఆ మధురానందము అందరూ పొందాలి. అందుకే మాస్టారుగారు ఒక చోట అంటారు. ''అందరూ ముక్తిధామానికి నడచిపోయే చెక్క వంతెనగా నేను ఉపయోగపడితే చాలు, చివరివాడు నన్ను తనతో తీసుకుపోతే చాలు''.

తన లక్ష్యాలకు ఆలంబనగా మాస్టారుగారు ఒంగోలులో నివాసము చేస్తున్నప్పుడు, మారుమూల గ్రామాలలో సైతము పర్యటించి సాయి తత్వము ప్రవచనాల ద్వారా అందించడమే కాకుండా ప్రతి ఒక్కరికి అందుబాటులో రావాటానికి 1983లో శ్రీరామనవమినాడు ''సాయి బాబా'' పక్షపత్రిక ప్రారంభించి తద్వారా దత్తసాయి సాంప్రదాయాన్ని అందించడమే కాక, శాస్త్రబద్ధమైన, విజ్ఞాన పరమైన వ్యాసాలను కూడా అందించారు. అంతేకాక సాయి స్వరూపులైన మహాత్ముల యొక్క జీవిత చరిత్రలను, దత్తావతారుల యొక్క జీవిత చరిత్రలు, సమయాను సారముగా పండుగలకు, పర్వదినాలకు వాటి అంతరార్థము తెలియజేసే వ్యాసాలు, భక్తుల అనుభవాలు ఇంకా ఎన్నెన్నో సాధనాపరమైన అంశాలు పత్రిక ద్వారా అందించారు.

అంతే కాకుండా, ''సాయిబాబా మిషన్'' ద్వారా, మహాత్ముల జీవిత చరిత్రలను, తాను దర్శించిన మహాత్ముల యొక్క జీవిత చరిత్రలను అందరికి అందుబాటులోకి తెచ్చారు. సత్సంగాలు, సమావేశాలు, హేతువాదులతో చర్చలు, నిరంతరము ''సాయి స్మరణ'' అనే తపస్సు తాను ఒంగోలులో నివసించిన 8సం॥లపాటు మాస్టారుగారు అవిచ్ఛిన్నముగా కొనసాగించిన ''సాయి యజ్ఞము''.

**ఆత్మ జ్ఞానానికి, నాలుగు విషయాలు తప్పనిసరిగా సమకూడాలి.**

1. పరిపూర్ణుడైన సద్గురువు లభించాలి.
2. సద్గురువును సంపూర్ణముగా సేవించే భాగ్యము కలగాలి.
3. మన సేవకు సద్గురువు సంప్రీతుడవ్వాలి.
4. మన సంస్కారానికి అనుగుణ్యమైన ఉత్తమమైన సాధనా మార్గము బోధించాలి.

మన పూర్వజన్మ సుకృతము వలన ఏవత్ విశ్వము తన స్వరూపమే నని ప్రత్యక్ష నిరూపణ చేసినటువంటి, ''ఈ యుగావతారమైన సద్గురు సామ్రాట్ శ్రీ శిరిడి సాయి నాథుడు మనకు లభించిన తరువాత, ఇంకా ఎందుకువెతుకులాట, పీకులాట, నిరీక్షణ'' అంటారు మాస్టారుగారు.

## తన్ను గురించి తాను శ్రీ ఆచార్యులవారు

అసలు మాస్టారుగారి సహజస్థితి ఏమిటి? అని మనం ప్రశ్నించుకొనే కన్నా మాస్టారిగారి మాటల్లో విందాము. ''నన్నెవ్వరు ఎన్నడూ తెలుసుకోలేరు తెలుసుకోవాలంటే మీ సాధన నిలిచిపోతుంది''.

''నాకు ఎవరి మీద ప్రేమ, ద్వేషము వుండదు. నా వద్దకు ఎవరు చేరినా, ఋణానుబంధము వల్లనే చేరుతారు. ఇక్కడకు వచ్చిన వారు, వారి వారి పరిపాకాన్ని బట్టి ఫలితం పొందుతారు''.

''నా సన్నిధికి వచ్చి దాన్ని సద్వినియోగము చేసుకోని వారి గురించి నేనేమి చెప్పేది. నాకు దూరంగా వున్నా సాయిని నిరంతరము నమ్మినవాని మీద నా దృష్టి ఉంటుంది. నా వద్దకు వచ్చిన వారికి అయిష్టమైన పనినే కల్పిస్తాను. తట్టుకొని నిలబడిన వాడే నా కిష్టుడు.''

ఒకసారి ఒక భక్తుడు మాస్టారుగారిని, ఏదైనా సాధనా విధానము చెప్పమని కోరేడు. అందులకు మాస్టారుగారు ''నావద్దకు రావటం, ఇక్కడ కొంతసేపు వుండడము గొప్పసాధన అని గుర్తుంచుకో చాలు'' అని అన్నారు.

శ్రీ మేడా జయరాం అనే భక్తుడు నేను '' అరుణాచలం'' గిరి ప్రదక్షిణకు వెళ్ళలేక పోయాను. అని మాస్టారుగారి దగ్గర చెప్పుకొని బాధపడ్డారు. అందుకు మాస్టారుగారు, ''నీవు రోజూ నా వద్దకు వచ్చివెళ్ళటం ఒక గిరి ప్రదక్షణతో సమానం అది గుర్తుంచుకో చాలు'' అని అన్నారు.

కాబట్టి ఆచార్యులవారు ఎవరు? అనేది మనకు ఊహకు అందని విషయము. మాస్టారుగారు అంతుపట్టని ఒక క్రాస్ పజిల్ – అంటే ఎలా? అని అంటారేమో, కాని అది వాస్తవము ఎందుకంటే ఒకసారి మాస్టారుగారు అన్నారు. ''ఏది శూన్యమో అది నేను'' అని.

## మాస్టారుగారి మధురవాక్కులు - అమృత గుళికలు

వివిధ సందర్భాలలో మాస్టారుగారు అందించిన అమృత గుళికలు మనందరము ఆస్వాదించడానికి ప్రయత్నము చేద్దాము.

పంచిన శ్రీ పెసల సుబ్బరామయ్యగారికి కృతజ్ఞతలతో ముందుకు సాగుదాము.

**అమృత గుళికలు :-**

1. తృప్తి, శాంతి, ఆనందము అన్ని జీవులకు ప్రసాదించాలనే తపనతో శ్రీసాయి గాని, ఇతర మహాత్ములు గాని నిర్విరామముగా కృషి చేస్తున్నారు.
2. జీవిత కళ నేర్చుకొని ఆచరించి తృప్తి, శాంతి ఆనందము పొందమంటున్నారు.
3. జీవిత కళ అంటే ఇష్టము, అయిష్టము లేకుండా జీవించడము. భగవంతుడు మనలను ఉంచినట్లు ధర్మబద్ధముగా జీవించడము. ధర్మబద్ధమైన ప్రయత్నాలు చేయడము.
4. ''త్వమేవ మతాచ, పితా త్వమేవ'' అన్న శ్లోకం యొక్క అర్థం తెలిసుకొని ఆచరించాలి. కేవలం చదివితే నిష్ప్రయోజనము.
5. సంఖ్యాపరమైన పారాయణలు మాని, శ్రీసాయి బోధనలను ఆచరించి , ఆనందించాలి.
6. ఇతర జీవులకు సహకరిస్తూ జీవించడం ఎలానో, తన ఆచరణ ద్వారా తెలియజేసారు సాయి. మనమూ ఆ ప్రయత్నమే చేయాలి.
7. భగవంతుడు నిజంగా మననుండి కోరేదేమిటి? (1) మనకాలం (2) మన మనస్సు, భగవంతుడు మనకు 24 గం॥ కాలము ఇచ్చారు, అందులో 6 గం॥లసేపు నిద్రపోయినా ఇక 18గం॥ కాలముంది. ఈ 18 గం॥ పొట్టకూటి సంపాదన కోసమే ప్రాకులాడడం, దానిని అనుభవించడముతోనే గడిపేయడం చాలా అధర్మము. మనకు ఇంతగా అన్నీ ప్రసాదిస్తున్న భగవంతునికి కృతజ్ఞతగా నిత్యము ఒక 1/2 గం॥ కాని, గంట కాని, వీలుంటే ఇంకా ఎక్కువ సమయము

పారాయణ, పూజ, ధ్యానం, నామస్మరణ లాంటి సాధనలకు ఉపయోగించి భగవంతుని కృపపొందాలి. తన మనస్సు తన తిరుగుబోతు తనాన్ని మానదు. కాని నిత్యం మొండికేసుకొని శ్రద్ధగా కూర్చోగలిగితే భగవంతుని కృప వలన వశమవుతుంది.

మనం చుట్టాలు, వచ్చారని, స్నేహితులని, ఆపదలని, అనారోగ్యాలని, నిత్యం భగవంతుని కిచ్చే కాలము వారికి సమర్పించకుండా తప్పుకొని, వారి కృప మాత్రం ఎల్లవేళలా మనకు లభించాలని తలచడం చాలా అధర్మమైన పని.

8. మానవుని అశాంతికి కారణం మానవునికి జీవిత కళ తెలియక పోవడం. జీవిత కళ అంటే **"Art of Living"** జీవితకళ తెలిసిన వారు ఇష్టము, అయిష్టము లేకుండా జీవించడము నేర్చుకోవాలి.

9. సాయి చరిత్రగాని, ఏ మహనీయుని చరిత్రగాని మనకేమి బోధిస్తుంది? ఈ చూడబడేదంతా కలసి నేను'' అన్న సాయి సూక్తికి ఉదాహరణ అయితే మన మందిరాలన్ని ఏమిచేస్తున్నాయి. సాయి ఆశించిన దానికి, బోధించిన దానికి, పూర్తి వ్యతిరేకముగా ఆచరిస్తున్నాము.

ఎ) మందిర ఫండ్సన్నీ సాయికి కిరీటాలు చేయించేందుకు.

బి) సాయికి రంగురంగుల డ్రెస్సెస్ కొనేందుకు వాడుతున్నాము.

సి) సాయి మందిరాలకు పాలరాళ్ళు తాపించడంలో మునిగిపోతున్నాము.

డి) ఒకటికి నాలుగు రకాల నైవేద్యాలు పెట్టేందుకు వాడుతున్నాము.

ఇ) సాయి మందిరాలు, చివరికి గోడలు, నేల కూడా ఆధునిక సౌకర్యాలు, హంగులు, ఆర్భాటాలతో ముంచేస్తున్నాము. ***సాయి ఆశించినది ఇదేనా ?***

మన మంత్ర పుష్పాలు, నమక చమకాలు, త్వమేవ మాతాచ – త్వమేవ పితాచ, అష్టోత్తరములు, సహస్ర నామాలు. ఇవన్నీ ఏమి చెప్తున్నాయి. విశ్వమంతా భగవంతుని రూపమే కదా. మరి అలా విని వదిలేయడమే కాని ఏకొంచమైనా ఆచరిస్తున్నామా.

## మందిరమునకు వచ్చే నిధులను సద్వినియోగం చేసే కొన్ని మార్గాలు.

1. ఉచిత వైద్యాలయాలు నడపడం.
2. చుట్టుప్రక్కల వైద్యాలయాలలోని బీదవారికి మందులు, ఆహారము ఉచితముగా ఇవ్వడం.
3. ఆర్థిక స్తోమత లేక మధ్యలో చదువు ఆపివేసే తెలివి వుండి చదవలేని పేద విద్యార్థులకు ఆర్థిక సహాయము అందించడము.
4. ఆధ్యాత్మిక లైబ్రరరీ ఏర్పాటు చేయడవు. వాటిని ఎంతవుంది ఉపయోగించుకున్నారు అన్నది మన ఆశయం కాకూడదు. ఏ ఒక్కరు ఉపయోగించుకున్నా మన ఫండ్సన్నీ సద్వినియోగం అయినట్లే.
5. అనాధులకు ఆశ్రయము, విద్యాసౌకర్యము కల్పించడము.
6. ప్రకృతి వైపరీత్యాల వలన గూడు కోల్పోయిన వారికి గృహవసతి కల్పించడము.

ఇలాంటివి ఎన్నెన్నో చేయవచ్చు, కాని ఆచరించేవారు ఎంతమంది? విరివిగా అన్నదానాలు మాత్రము చేస్తున్నారు. అయితే అవి ఎవరికి చేస్తున్నాము? బాగా తిని అరగని వారికి. నిజంగా ఆకలితో అలమటిస్తున్న వాళ్ళకు మందిరము బయట ఇంతకూడు పడేస్తున్నాము. వారిని ఎప్పుడైన సహపంక్తి భోజనము ఏర్పాటు చేయగలుగుతున్నామా. లేక వారికి కడుపు నిండుగానైనా భోజనము పెట్టగల్గుతున్నామా?

ఇవన్ని ఆచరించని మనము, సాయి భక్తులమని చెప్పుకుని తిరుగుతున్నాము. పైగా పూర్తిగా నమ్మిన మనల్ని సాయి రక్షించలేదని వాపోతున్నాము. సాయి భక్తునికి భయము ఆందోళన వచ్చేయంటే. అందులకు కారణము, సాయిపై విశ్వాసము లేకపోవటమే. ఏదయినా మనకు మంచిదైతేనే బాబా సహాయము చేస్తారు. మంచిది కాకపోతే మనము ఏడ్చి తన్నుకున్నా సహాయము చేయరు. అందుకు సాయి మీద అలగటం, మనస్సు పాడుచేసుకోవడం, బాధపడటం తగదు.

''అంతా అల్లా మాలిక్'' కనుక మనము ఎవ్వరిని వేలెత్తి చూపకూడదు. మనుష్యులను పరోక్షంగా ఎప్పుడు విమర్శించరాదు. దాని ద్వారా మన పాపాన్ని మనమే పెంచుకుంటున్నాము.

# తండ్రి దగ్గరకు

తాను నిర్దేశించిన పనిని, తన అనుంగు బిడ్డడైన శ్రీ భరద్వాజ సంపూర్తిగా సంతృప్తిగా నెరవేర్చారని తలచారు కాబోలు సాయి, తన దగ్గరకు రప్పించుకోనటానికి రంగం సిద్ధం చేసారు.

అది తెలిసిన మాస్టారు గారు తన దేహత్యాగం గురించి అర్హులైన కొంత మందికి ముందుగా తెలియజేసారు.

''శ్రీపాకాలపాటి గురువుగారు మీకు శ్రీశైలం అడవులు చూపిస్తానన్నారు కదా! వారిప్పుడు దేహంతో లేరు కదా! మరి అది ఎలా కుదురుతుంది'' అని అడిగిన శ్రీ రంగారావు తో మాస్టారుగారు, ''నేను సూక్ష్మ దేహంధరిస్తే సరి'' అని అన్నారు.

ఒంగోలు సాయి మందిరములోని బాబా విగ్రహనిమిత్తము ఢిల్లీ వెళ్ళినప్పుడు ప్రక్కనే ఉన్న శ్రీ రంగారావుతో ''బాబా నాకు అప్పగించిన పని పూర్తి చేసేను. ఇక ప్రవచనాలు. ఈ రీతిలో నువ్వే చెప్పు'' అని చెప్పి కొన్ని సూచనలు మాస్టారు గారు ఇచ్చారు.

తేది 10–4–89న జరిగిన సత్సంగములో ''శ్రద్ధ – ఓరిమి'' అనే రెండు సంచులు సర్దుకొని ప్లాటుఫారం మీదకు వచ్చాను. రైలు రావటమే తరువాయి. వెనుకకు తిరిగి చూడకుండా ఎక్కాలి. అది మన కోసం ఆగదు వెళ్ళిపోవటమే'' అన్నారు మాస్టారు గారు. శ్రీ పెసల సుబ్బరామయ్యకు మాస్టారు గారు తను ధరించిన వస్త్రాలు ఇస్తూ ''ఇవి మరలా లభించవు'' అని అన్నారు.

అది 1989వ సంవత్సరము ఏప్రిల్ నెల. తెలుగు ఉగాదిని అందరూ ఆనందంగా జరుపుకున్నారు. మాస్టారుగారి రాకకై విద్యానగర్ సాయిమందిరము ముస్తాబు అవుతున్నది. దేశమంతటా వసంత నవరాత్రులు ప్రారంభమైనవి. ప్రజలందరూ పండుగ సంబరాలతో మునిగిఉన్నారు. మాస్టారుగారు మాత్రం నిద్రాహారాలు మాని సాయి తనకు అప్పగించిన పనిని కొనసాగిస్తున్నారు.

పూజ్యశ్రీ మాస్టారు గారి ఆదేశంపై ఎంతోకాలంగా శ్రీ సాయినాథుని సన్నిధిలో 108 సార్లు గురుచరిత్ర, సాయి చరిత్ర పారాయణలు పూర్తిచేసిన, ఉత్తమ సాధకులైన అయోధ్య గారు శ్రీ మాస్టారు గారి ఆశీస్సులు తీసుకొని, 20 రోజులు దక్షిణ దేశ యాత్రకి బయలు దేరి సేలంలో ఉన్న ''మాయి అమ్మ'' దగ్గరకు వెళ్ళి ఉన్నారు. 9వ తేది రాత్రి ఆయనకు ఒక దివ్యమైన స్వప్నము వచ్చింది. ఆస్వప్నంలో దేదీప్యమైన వెలుగుతో శ్రీ అక్కల్‌కోట మహారాజుగారు నిల్చుని ఉన్నారు. వారి ఆదేశాను సారం, ముక్తి కాంతలు, శ్రీ మాస్టారు గార్ని ఆహ్వానించి తీసుకొని వెళ్తున్నారు. ఎందరో సిద్ధ పురుషులు వరుసగా నిల్చుని ఉన్నారు. శ్రీ పాకలపాటి గురువు గారు, మాస్టారు గారి ప్రక్కన నిల్చుని ఉన్నారు. వెంటనే అయోధ్య గారికి మెలుకువ వచ్చింది. ఆ 'కలనే' స్మరించుకుంటూ మాస్టారుగారి సన్నిధి ( ఒంగోలు) కి బయలు దేరుతూ, 'సేలం అమ్మను' సెలవు కోరినప్పుడు, అమ్మ కంటి తడి పెట్టి విభూధి, తీర్థం ప్రసాదంగా ఇచ్చారు. అదే సమయంలో శ్రీ అక్కలకోట మహారాజ్ గారి ఆదేశము మేరకు వారి శిష్యులైన శ్రీ చోళప్ప ముని మనుమడు, అక్కల్‌కోట స్వామి వారి నిర్గుణ పాదుకలతో ఒంగోలు చేరడము జరిగినది. ఏప్రిల్ 12, బుధవారము ఒంగోలు చేరినటువంటి శ్రీ అయోధ్య, మాయి అమ్మ దగ్గర నుండి తీసుకువచ్చిన తీర్థ ప్రసాదాలను మాస్టారు గారు అందరికి పంచి, తాము కూడ ఎంతో శ్రద్ధా భక్తులతో తీసుకున్నారు. కంచి కామాక్షి అమ్మవారికి మెడలో వేసిన మాలను అయోధ్య మాస్టారు గారికి యివ్వగా కళ్ళుకద్దుకుని నమస్కరించుకొని అమ్మగారికిచ్చారు. అయోధ్య మాయి అమ్మ దగ్గరి విశేషాలను గూర్చి చెబుతుంటే ఎంతో ఆనందంగా విన్నారు మాస్టారు గారు. తర్వాత అక్కల్ కోటస్వామి పాదుకలను స్థానిక మందిరానికి తీసుకెళ్తుండగా వాటిని కళ్ళుకద్దుకొని, తలపై పెట్టుకొని నమస్కరించి పంపేరు. ప్రతి రోజు మాస్టారుగారు చెబుతుంటే వ్రాసి పెట్టే హరనాథ్‌ను కాగితాలు తెచ్చుకొమ్మని సాయిలీలామృతం (7వ ముద్రణ) చివరి పేజీలో చివరి వాక్యము వ్రాసారు. వారు వ్రాసిన చివరి వాక్యము ''**సాయి చరిత్ర, గురు చరిత్ర**'' పారాయణ చేసే వారికి జరుగుతున్నవి, జరగబోయే కష్టాలు కూడా తొలిగిపోయి అధ్యాత్మిక ఉన్నతి, సద్గురు

అనుగ్రహం లభిస్తుంది'' అని వ్రాసారు. ఆ వెంటనే తమ గుండె వద్ద నరాలు నొప్పిగా ఉన్నాయని చెప్పేరు మాస్టారు గారు. వెంటనే శ్రీ అయోధ్య మాయి అమ్మ ఇచ్చిన ఊదిని, నామస్మరణతో, నొప్పిఉన్న చోట వ్రాయసాగారు. తాను ఎప్పుడు కూర్చొని, సత్సంగం జరిపే చోట బాబా ఎదుటగా, ప్రతి శ్వాసను సాయి స్మరణతో నింపుకున్న మాస్టారు గారు తన చివరి శ్వాసను ఏప్రిల్ 12 1989 బుధవారము చైత్రశుద్ధ సప్తమి ఉ॥ 7.54 ని॥లకు సాయి పాదాల వద్ద వదలి సాయి నాథునిలో ఐక్యమయ్యారు. ***''మన హృదయాలలో కాంతిని నింపటానికి 1938వ సం.. అక్టోబరు 30వ తేదీన కార్తీక శుద్ధ సప్తమి నాడు, సప్తర్షి మండలం నుంచి మన మధ్యకు అవతరించినటు వంటి సాయి అనుంగు బిడ్డడు  పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారు ఎన్నో లక్షలాది హృదయాలను సాయి మందిరాలుగా మార్చి అందరి హృదయాలలో వసంతాన్ని నింపి ఏప్రిల్ 12, 1989 బుధవారము చైత్రశుద్ధ సప్తమి నాడు తిరిగి తన సప్తర్షి మండలంలోకి పయనమై వెళ్ళారు''.***

మరురోజు గురువారం మధ్యాహ్నం 3 గం॥లకు మాస్టారు గారి భౌతిక దేహాన్ని వేలాది మంది వెంటరాగా, ఒంగోలు పుర వీధులలో ఊరేగింపుగా తీసుకొని వెళ్ళి మాస్టారు గారి కలలపంటైన ఒంగోలు, లాయర్‌పేట శ్రీ శిరిడీ  సాయి బాబా మందిరములో నందదీప్ దగ్గర మాస్టారు గార్ని సమాధి చేయుడం జరిగినది. దేహానంతరం కూడా తన అనుంగు బిడ్డడి ఎడబాటును సహించలేని సాయి తన చెంతనే ఉంచుకోదలిచారు కాబోలు, అందుకే తన ప్రక్కనే మాస్టారు గారికి చోటు ఇచ్చారు. సాయి లాగానే మాస్టారుగారు కూడ తన గద్దెకు ఎవర్ని వారసులను చేయలేదు. అందుకే భౌతిక దేహానంతరము కూడా సాయి – మాస్టార్లు అప్రమత్తులై తననను ఆశ్రయించిన వారిని, శరణు జొచ్చిన వారిని నిరంతరము నేటికి కాపాడుతునే ఉన్నారు. తమ సమాధుల నుంచే సర్వ కార్యములు నిర్వహిస్తున్నారు. అందుకే సాయి–మాస్టారు నేటికి నిత్య సత్యులే. అవసరమైన వారికి భౌతిక దేహముతో కూడా దర్శనమిచ్చి ముందుకు నడిపించుచున్నారు.

# సాయి - మాస్టారు

''ఎవరైతే నన్నేస్మరిస్తూ, నా లీలలనే వింటూ, నా చరిత్ర పారాయణ చేస్తుంటారో వారి కర్మ నశిస్తుంది. వారే నేనుగా మారి పోతారు'' అన్న సాయి సూక్తికి ప్రత్యక్ష నిదర్శనము శ్రీ భరద్వాజ మాస్టారు గారు. వారు వ్రాసిన సాయి లీలామృతము చదివి అనేక లక్షలాది మంది సన్మార్గములో పయనిస్తున్నారు, సాయి కృపకు పాత్రులవుతున్నారు. అటువంటప్పుడు దాని రూప శిల్పి అయిన భరద్వాజ గారు సాయి స్వరూపులు కాక మరేమవుతారు !

''ముక్తి ధామానికి నడిచిపోయే చెక్క వంతెనగా నేను ఉపయోగపడితే చాలు చివరివాడు నన్ను తనతో తీసుకు వెళితే చాలు'' అని చెప్పిన మాస్టారు గారు నడిచిన సాయి మార్గంలో పయనం చేయటానికి మనమూ ప్రయత్నిద్దాం.

1. సాయి తన గురువు కొరకు అన్వేషించి గురువును కనుక్కున్నారు.
✤ మాస్టారు గారు తన అన్వేషణలో గురువును కనుక్కున్నారు.
2. సాయి 12 సంవత్సరాలు భూగృహంలో తపస్సు చేసారు.
✤ మాస్టారు గారు విద్యానగరులో గడిపిన 12 సంవత్సరాలు తపోనిష్ఠలో గడిపేరు.
3. సర్వమూ ''అల్లా మాలిక్'' అన్నారు సాయి.
✤ ''సబ్‌కా మాలిక్ సాయి'' అన్నారు మాస్టారు.
4. ప్రజలను ఆకర్షించడానికి మహిమలు చిల్లర ప్రదర్శనలు సాయి ఏనాడు చేయలేదు.
✤ మహిమలు, చిల్లర ప్రదర్శనలను దరి చేరనీయలేదు. మాస్టారు గారు. చివరి కంటా గుప్పెట మూసే ఉంచారు.
5. మత సమరస్యానికి ప్రతీకగా శ్రీరామ నవమినాడు ఉరుసు ఉత్సవం జరిపించారు సాయి.
✤ ఆ వేడుకలను నేడు కన్నులారా ఒంగోలు సాయి మందిరములో తిలకించవచ్చు.
6. మొహిద్దీన్ తంబూలీ తో కుస్తీ పోటీలో ఓడినా, జవహర్ ఆలీ, సాయి తన శిష్యుడని చెప్పినా, విద్యావేత్తలు, లక్షాధికారులు సాక్షాత్తు నీవు దత్తాత్రేయుడివి అని కాళ్ళ మీద పడినా, సాయి చివరి కంటా ఫకీరు లాగానే జీవించారు.
✤ పొగిడిన వాళ్ళే దూషించినా, దూషించిన వాళ్ళే పొగడినా, అవి రెండు వాళ్ళ అభిప్రాయాలే తప్ప వాటితో నాకు ఏనాడు సంబంధం లేదు అని ''భగవంతుడు మనలను ఎలా సృష్టించాడో, అలానే తృప్తిగా ఉండాలి'' అనే సాయి సూక్తికి ప్రతీకగా నిలిచారు మాస్టారు గారు.

7. భక్తుల బలవంతము మీద మసీదు చేరిన సాయి జీవితాంతము పాడు పడ్డ మసీదులోనే జీవించారు.

✤ మాస్టారు గారు చివరి వరకు ఒక భక్తుని వసతి గృహంలోనే నివశించారు.

8. సాయి తన సమాధి గురించి ముందుగానే తెలియజేశారు.

✤ మాస్టారు గారు తన ఆప్తులందరికి తన సమాధి విషయం అందించారు.

9. సాయి సమాధి చెందినప్పుడు ఆయన దగ్గర 7 నాణేలు తప్ప ఏమీ లేవు.

✤ మాస్టారు గారు సమాధి చెందినప్పుడు భక్తులు తమ చందా డబ్బులతో ఐస్ తెప్పించాల్సి వచ్చింది.

10. తాను సమాధి అయ్యేంత వరకు సాయి తన చరిత్రను వ్రాయుటానికి అంగీకరించలేదు.

✤ తన గురించిన ''మరోనంద దీపం'' అనే సావనీర్ అందరికీ అందేసరికి మాస్టారు గారు సమాధి అయ్యారు.

11. సాయి సమాధిని ఎందరో మహాత్ములు దర్శనము చేసుకున్నారు.

✤ మాస్టారు గారి సమాధిని రామిరెడ్డి తాత, మొదలైన మహాత్ములు దర్శనం చేసుకున్నారు.

12. సమాధి అయిన తరువాత భక్తులకు స్వప్నదర్శనము, భౌతిక దర్శనము ఇస్తూ అనుగ్రహిస్తున్నారు సాయి.

✤ సమాధి అయిన తరువాత ఎందరో భక్తులకు స్వప్న దర్శనము, భౌతిక దర్శనము ఇచ్చి అనుగ్రహిస్తున్నారు మాస్టారు గారు.

13. తన భౌతిక దేహానంతరము అప్రమత్తుడనే అనే సూక్తిని నిజం చేస్తూ ఎటువంటి వారి లోనైనా తన సమాధి దర్శనం చేసిన తోడనే వారిలో ఉత్తమమైన మార్పు తీసుకువస్తున్నారు సాయి.

✤ మాస్టారి గారి సమాధి దర్శనము చేసుకున్న తరువాత ఆధ్యాత్మిక పథం వైపు మొగ్గు చూపిన వారెందరో ఉన్నారు.

14. సాయి సమాధి దర్శనం తోనే కష్టాలు, కోరికలు తీరిన వాళ్ళు అనేక మంది ఉన్నారు.

✤ మాస్టారి గారి సమాధి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వారిని ఎవరిని పలకరించినా మాస్టారు గారు నెరవేర్చిన కోర్కెలు, తీర్చిన కష్టాలు గురించే చెబుతారు.

15. ఈ రోజు లక్షలాది మంది శిరిడి గడ్డపై అడుగుపెట్టి సాయి సమాధి దర్శనం

చేసుకొని పునీతమవుతున్నారు.

- ఒంగోలు వెళ్ళి ఏ సాయి భక్తుడిని పలకరించినా, వాళ్ళు చెప్పేది ఒక్కటే మాస్టారి గారిని సజీవముగా చూసే అదృష్టము కలుగలేదు. కనీసము వారి సమాధి అయిన దర్శనం చేసుకొని పునీతమవుదామని వెళుతున్నామని చెబుతున్నారు.

16. ఒంగోలు శిరిడీ సాయి మందిర మహారాజ్ ప్రాంగణములో జరిగే కార్యక్రమాలను చూస్తే పులకించిపోతారు సాయి మాస్టర్ భక్తులు.

ఉదయం సాయికి హారతి జరుగుతుంటే, మాస్టారి గారికి మేలుకొలుపు జరుగుతుంది. సాయికి అభిషేకము జరుగుతుంటే, మాస్టారి గారికి సమాధికి అభిషేకము జరుగుతుంది.

సాయికి అలంకరణ, అర్చన, షోడశోపచారములు జరుగుతుంటే, మాస్టారి గారి సమాధికి అలంకరణ, అర్చన, షోడశోపచారములు జరుగుతాయి.

ఆ తరువాత సాయికి ప్రదక్షిణలు చేసే వారి కన్నా మాస్టారి గారి సమాధి చుట్టూ ప్రదక్షిణాలు చేసే వారే ఎక్కువ కనిపిస్తారు. అక్కడ ఎవరిని పలకరించినా, ఈ రోజు మాకు మాస్టారి గారి సమాధికి అభిషేకం చేసే అదృష్టం కలిగింది అని ఒకరంటే, మాస్టారి గారి సమాధికి గంధం పూసే భాగ్యము కలిగిందని వేరొకరు చెబుతారు. ఏనాటి పుణ్యమో కాని మాస్టారి గారి సమాధిని పూలతో అలంకరించే అదృష్టము కలిగింది అని మరొకరు చెబుతారు.

ఈనాడు శిరిడీలో సాయినాథుని సమాధికి ఎంత రంగ రంగ వైభవంగా జరుగుతున్నదో అదే విధంగా ఒంగోలు లోని మాస్టారి గారి సమాధికి జరుగుతున్నది. ఇంకా చెప్పాలంటే సాయి తన కంటే తన అనుంగు బిడ్డడకు ఎక్కువ జరిపిస్తున్నారేమో అనిపిస్తుంది. అయితే శిరిడీలోని సాయితో కలిసి మెసలిన వారి సమాధులు చూస్తే ఒక్కోసారి వాటిని పట్టించు కొన్న వారే లేరేమో అనిపిస్తుంది. ఏమిటీ ఈ వ్యత్యాసం అని ఆలోచించగా, ఆలోచించగా, స్ఫురణకు వచ్చింది ఒక్కటే, వారందరూ సాయికి సమకాలీకులు, సాయితో కలసి మెలసి తిరిగి ఉండవచ్చు. అది వారి పూర్వజన్మ సుకృతము అది శిరిడీలో సమాధి అయ్యేంత వరకే సరిపోయింది.

మాస్టారు గారు సాయికి సమకాలీకులు కాకపోతేనేం, సాయి ఆచరించి, బోధించిన దానిని తూచా తప్పకుండా తాను ఆచరించి, అందరికీ అందించిన ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారు సాయి స్వరూపులైనారు. సాయికి జరిగే ప్రతీ వేడుక మాస్టారి గారికి జరుగుతున్నది అందుకే. ***దట్ ఈజ్ ద సాయి మాస్టర్***

# నిత్య సత్యులు శ్రీ భరద్వాజులు

వరంగల్ వాస్తవ్యులు శ్రీ తోట సంపత్ కుమార్ గారు. ఇలా చెబుతున్నారు :- మేము సాయి భక్తులం. 1994లో మేము శిరిడీ వెళ్ళాం. మా మదికి పూజ్య ఆచార్యుల వారురచించిన ''సాయి లీలామృతము'' చదువుకోవాలని కోరిక. ఆచార్యుల వారు సిద్ధి పొందినట్లు మాకు తెలియదు. లీలామృతము కోసం ఒంగోలు వ్రాసాము. సమాధానం రాలేదు. సరే శిరిడీ వెళ్తున్నాం గనుక అక్కడ కొనుక్కుందాం అని చెప్పాను. శిరిడీ వెళ్ళాం. సాయి దర్శనం అయిన తరువాత లీలామృతము కోసం వెతికేము. అక్కడ స్టాకు లేదు అన్నారు. మా ఆవిడ బయలు దేరేముందు ద్వారకామాయి బయటి నుంచొని. బాబా ''సాయి లీలామృతము'' కొని చదవాలని ఎంతో ఆశగా వచ్చాను. కాని ఆశతీరకుండానే వెళ్ళిపోతున్నాను. అని కళ్ళు నీళ్ళ పర్యంతము అయింది. ఆ సమయంలో మా ఆవిడకు చాలాదగ్గరగా ఒక సాధువు నిలబడ్డాడు. ముఖం చాలా తేజోవంతంగా ఉంది. నేను చాలా గిల్టీగా ఫీలయినాను. ఆయనను ప్రక్కకు జరగండి అన్నాను. ఆయన చాలా స్వచ్ఛమైన తెలుగులో ''అమ్మాయి ఎందుకు బాధ పడుచున్నది ?'' అని అడిగారు. నేను లీలామృతము దొరకలేదని వివరం చెప్పాను. అంతే గదా నా వద్ద వున్నది అని ఒక పుస్తకము ఇచ్చారు. నాకు చాలా ఆనందమయింది. వెల చూసి పైకము ఇద్దామని ఇవ్వబోతే ''వద్దు బాబు ఇంత శ్రద్ధగా చదువుకోవాలని అనుకునే వారికి ఇద్దామని'' నా వద్ద ఎప్పుడూ 2 లీలామృతములు ఉంచుకుంటాను. ఒకటి మీకు ఇచ్చాను. ఇక బయలుదేరండి అని అన్నాడు. ఆయన మీద ''గిల్టీ'' ఫీల్ అయినందుకు మనస్సులోనే క్షమాపణ చెప్పుకొని నమస్కారం చేసుకొని కారులో బయలుదేరాం. శిరిడి దాటగానే మా ఆవిడ లీలామృతము పేజి తెరిచింది. అందులో పూజ్యశ్రీ ఆచార్యులవారు పటం వున్నది. మాకు కనిపించిన సాధువు యొక్క ముఖకవళికలు అన్ని పటములో లాగనే వున్నాయి. మా ఆనందానికి అవధులు లేవు. ఆశ్చర్యపోయినా. బాబా మాస్టారి కరుణకు. వరంగల్ వచ్చిన తరువాత మాస్టరుగారు 1989లోనే సిద్ధి పొందారని తెలిసింది. మరి మాకు కన్పించి లీలామృతము ఇచ్చిన వ్యక్తి ఎవరు ? ఆచార్యుల వారేనేమో ! ఈలోపల శ్రీ కె.వి. రంగారావు అనే భక్తులు వరంగల్ వచ్చారు. సాయితత్వం మీద ప్రవచనం ఇచ్చారు. నాకు ఎంతో ఆనందం వేసింది. వారిని మా యింటికి ''తేనేటి'' విందుకు ఆహ్వానించాను. యీ లీలామృతము

కథ చెప్పాను. వారు ఎంతో సంతోషించి ''ఏది ఆ లీలామృతము ఒకసారి చూపించండి అని అడిగారు.'' వారికి యిచ్చాము. వారు లీలామృతము చేతిలోకి తీసుకొని మాస్టరు గారికి నమస్కారంచేసి ఒక పేజి తెరిచారు. అది శిరిడీలో ''గురు పూర్ణిమ'' ఉత్సవం గురించిన పేరాగ్రాఫ్ వచ్చింది. చిత్రంగా నేను వరంగల్‌లో ప్రతి సంవత్సరం గురుపూర్ణిమ ఉత్సవాలకు బియ్యం సరఫరా చేస్తాను. అన్నదానంలో సేవా కార్యక్రమంలో పాల్గొంటాను. దానికి రంగారావు గారు. మీరు ఇంత శ్రద్ధగా గురువును విశ్వసించి ''గురు పూర్ణిమ'' ఉత్సవం జరిపిస్తున్నారు గనుకనే ఆచార్యుల వారు దర్శన మనుగ్రహించి ''లీలామృతము ప్రసాదించారు. మీరెంతో ధన్యులు అని అన్నారు. పైగా ఆచార్యులవారు ఇప్పటికీ సజీవులే అని చెప్పారు''.

**మాస్టారు గారి సిద్ధాంత ప్రణాళిక**

1. సరైన మానవత్వము అలవరచుకున్న తర్వాతనే ఆధ్యాత్మిక సాంప్రదాయానికి పనికి వస్తాము.
2. పరిపూర్ణుడైన మహాత్ముని సేవ సాంగత్యము లభించాలి.
3. ఆయన కృపకు మనము అర్హులం కావాలి.
4. మన సంస్కారానికి తగిన సాధనామార్గము ఆయన తెలియజేయాలి.

ఇవన్నీ అలవడాలి అంటే శ్రీ సాయి లీలామృతము, శ్రీ గురు చరిత్ర, ఇతర మహాత్ముల చరిత్ర పారాయణం చేయాలి. తప్పని సరిగా సత్సంగము, సద్గోష్టులలో పాల్గొనాలి. ఇవి ఆచరించుకుంటూ పోతే సద్గురువు కృప అనుభవమవ్వటమే కాకుండా శ్రీ దత్తాత్రేయుని అవతరణ తిరిగి ఆంధ్రదేశములో తప్పని సరిగా జరుగుతుంది.

ఈ సిద్ధాంత ప్రణాళికలో మనము పాల్గొందాం తద్వారా దత్తుని అనుగ్రహము పొందుదాము. మాస్టారు గారు చూపిన సాయి మార్గములో నడవటమే మనము మాస్టారు గారికి అందజేసుకునే చిరు కానుక. అది సమర్పించు కొనే శక్తిని ప్రసాదించమని తిరిగి సద్గురువు సాయి మాస్టర్‌నే వేడుకుందాం.

**శ్రీ సాయి నాథజై - గురు భరద్వాజ జై**

చదవండి! చదివించండి!! తరించండి!!!

విశాఖ - ఉక్కునగరము నుండి

శిరిడీసాయి సాంప్రదాయముతో ఆధ్యాత్మిక పవనాలు



శ్రీ భరద్వాజ

# సద్గురువాణి



**శ్రీ దత్తసాయి మాస్టర్ సాంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక**



"సాయి అన్న నామాన్ని ఉచ్చరించినంత మాత్రాన సప్త సముద్రాల అవతల ఉన్నా నిన్ను రక్షిస్తాను" అన్నారు బాబా. అంతేకాక, "నన్ను ఆశ్రయించిన వారిని, శరణువేడిన వారిని నిరంతరము కాపాడుటయేకాక, చివరికంటా ఉండి గమ్యము చేర్చుటయే నా కర్తవ్యము. నా దగ్గరకు వచ్చిన ప్రతి పైసాను (జీవిని) భగవంతుడికి అప్పగిస్తాను" అన్నారు బాబా. అందుకే లక్షలాదిమంది శ్రీ శిరిడీ సాయి బాబాను ఆశ్రయించి, కష్టాలు, కోర్కెలు తీర్చుకుంటున్నారు.

సాయిని ఆశ్రయిస్తున్న లక్షలాది మందిని చూసి "జోగ్" అనే భక్తుడి మనస్సులో ఒక సందేహము కలిగింది. "ఇంత మంది సాయిని ఆశ్రయిస్తున్నారు కదా? వీళ్ళందరూ నిజంగా చివరికంటా సాయిని అంటిపెట్టుకొని గమ్యం చేరుతారా?" అని. ప్రక్కనే ఉన్న సాయి. జోగ్ మనస్సులోని భావాన్ని గమనించి విరగబూసిన పూతతో నిండుగా ఉన్న ఒక మామిడి చెట్టును జోగ్‌కు చూపి "ఆ చెట్టుకు ఉన్న పూత అంతా పండు అవుతాయా? కావు కదా! పూతగా కొంత, పిందెగా కొంత, కాయగా మరికొంత రాలిపోగా, చివరికంటా చెట్టును అంటిపెట్టుకొని ఏ కొద్ది మాత్రమే పండ్లు అవుతాయి. ఆదీ మధ్యలో ఏ పిల్లా, పురుగు తినకుండా ఉంటే, నా దగ్గరకు వచ్చేవారు కూడా అంతే. నా దగ్గరకు వచ్చేవన్నీ చెల్లని నాణేలే. నా దగ్గర ఆధ్యాత్మిక ధనం రాసులు రాసులు పోసి వున్నా ఒక్కరూ దాని వైపు చూడటంలేదు" అన్నారు సాయిబాబా. మరి చెలామణి అయ్యే నాణెం లాగా మారి సద్గురువును చివరికంటా కూడా అంటిపెట్టుకొని పండులాంటి జీవితాన్ని పొందేది ఎలా? ఆ సమస్యకు పరాష్కార ఆవిష్కరణ ప్రయత్నరూపమే **"శ్రీ భరద్వాజ సద్గురువాణి"** పత్రిక.

| చందా వివరములు | | |
|---|---|---|
| విడి ప్రతి | - రూ॥ | 10/- |
| 1 సం॥ చందా | - రూ॥ | 50/- |
| 3 సం॥ల చందా | - రూ॥ | 150/- |
| పోషకులు (ఉదారులు) | - రూ॥ | 1000/- |

డి.డి లు ఎమ్.ఓ లు పంపవలసిన చిరునామా:

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

**శిరిడీ సాయి సేవాట్రస్టు,**

శ్రీ సద్గురు పాదుకా క్షేత్రము

ప్లాట్ నెం. 13, పవర్ సిటీ, పరవాడ మండలం,

విశాఖపట్నము - 531 021.

ఫోన్ : 9849645224


భరద్వాజ మహం వందే - సర్వ శిష్య ఫలప్రదమ్.
జననం : 30-10-1938
మహాసమాధి : 12-04-1989
శ్రీ భరద్వాజ బృందావనం - ఒంగోలు